# కర్నూలులో హైకోర్టు బెంచ్..!



మంత్రివర్గ సమావేశంలో తీర్మానం

- హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- 'ప్రజాగళం' సభలో చంద్రబాబు స్పష్టమైన హామీ
- న్యాయ రాజధాని, హైకోర్టు పేరిట గత ఐదేళ్లలో మోసం
- టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో కదులుతున్న బెంచ్ ఫైల్

**శ్రీ**బాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఈనాటిది కాదు. స్వాతంత్ర్యానికి పూర్వమే 1937 నుంచి సీమ ప్రజల హృదయాల్లో ఉంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాలుగా స్వప్నంగానే మిగిలిపోయింది. కర్నూలులో 'హైకోర్టు బెంచ్' ఏర్పాటు చేస్తాం అంటూ 2019 ఎన్నికల్లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. అధికారం చేపట్టిన వైసీపీ న్యాయ రాజధాని, హైకోర్టు.. అంటూ ఐదేళ్లు మభ్యపెట్టింది. ఎన్నికల్లో ఓట్ల కోసం ఎన్నో ఎత్తులు వేసింది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం.. అధికారంలోకి రాగానే ప్రక్రియ మొదలు పెడతామని 'ప్రజాగళం' సభలో అప్పటి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే కసరత్తు మొదలు పెట్టారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం తక్షణ చర్యలు మొదలు పెట్టాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు టీడీపీ కూట మి ప్రభుత్వం లేఖ రాసింది. అంతేకాకుండా బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేశారు.

**కర్నూలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రాయలసీమ (సీడెడ్ జిల్లాలు), ఆంధ్ర ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉండేవి. తమిళులు ఆధిపత్యం కారణంగా 1913లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి బీజం పడింది. అయితే ఈ విషయంలో కోస్తాంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య వివిధ అంశాలపై విభేదాలు తలెత్తాయి. అపోహలు, విభేదాలు తొలగించేందుకు ఇరుప్రాంతాలకు చెందిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, హాలహర్వి సీతారామిరెడ్డి, కడప కోటిరెడ్డి, కొండా వెంకటప్పయ్య, టీఎన్ రామకృష్ణారెడ్డి, మహబూబ్ అలీబేగ్, దేశిరాజు హనుమంతరావు, కల్లూరు సుబ్బారావు, వరదాచారి, పప్పూరి రామాచారి, సుబ్బరామిరెడ్డి, దేశపాండ్య సుబ్బారావు, మల్లిపూడి పల్లం రాజులతో ఏర్పడిన సంఘం 1937 నవంబరు 16న మద్రాస్‌లోని కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహం 'శ్రీబాగ్' భవనంలో సమావేశమైంది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయ్యాక 1. రాజధాని లేదా హైకోర్టు రాయలసీమలో ఏర్పాటు, 2. కృష్ణా, తుంగభద్ర జలాలలో రాయలసీమ, నెల్లూరుకు ప్రథమ ప్రాధాన్యత, 3. రాయలసీమలో విశ్వవిద్యాలయం, 4. శాసనసభ స్థానాల్లో ఇరుప్రాంతాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.. అనే అంశాలపై ఏకాభిప్రాయంతో ఒప్పందం చేసుకున్నారు. శ్రీబాగ్ భవనంలో ఒప్పందం జరగడంతో 'శ్రీబాగ్ ఒడంబడికగా పిలుస్తూ వచ్చారు. 1952 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు తరువాత రాయలసీమ ప్రాంతం కర్నూలులో రాజధాని, కోస్తాంధ్ర ప్రాంతం గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారు. 1956 నవంబరు 1న ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. రాజధాని, హైకోర్టు హైదరాబాద్‌కు తరలిపోయాయి. శ్రీబాగ్ ఒప్పందం నీరుగారిపోయింది. 2014లో రాష్ట్ర విభజన తరువాత శ్రీబాగ్ ఒడంబడిక అమలు డిమాండ్ తెరపైకి వచ్చింది. అమరావతి రాజధానిగా చేయడంతో కర్నూలులో హైకోర్టు పెట్టాలనే న్యాయవాదులు, విద్యార్థులు ఉద్యమాలకు సై అన్నారు.

మిగతా 7లో..

# ఎయిర్‌పోర్టుకు పల్లెవెలుగు!





ఎయిర్‌పోర్టు ఎదుట ఆర్టీసీ బస్సు

**ఓర్వకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లులోని కర్నూలు విమానాశ్రయానికి ఆర్టీసీ అధికారులు పల్లెవెలుగు సర్వీసును బుధవారం నుంచి ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం మొదటి సర్వీసు కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 8:45కు ప్రారంభమై 9:30 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుంచి బయల్దేరి 12:45 గంటలకు కర్నూలు బస్టాండుకు, అలాగే కర్నూలు బస్టాండు నుంచి 1.15 కు బయల్దేరి 2 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకుంది. సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 4:45 గంటలకు కర్నూలు బస్టాండుకు చేరుకుంది. ఇదిలా ఉండగా టికెట్ ధర్ రూ.30గా నిర్ణయించినట్లు కర్నూలు డిపో-1 మేనేజర్ సుధారాణి వెల్లడించారు. జిల్లా వాసులు బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# చెరువులను నింపండి :కలెక్టర్

**కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** హంద్రీ నీవా నీటితో 68 చెరువులను నింపేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. విజయవాడలో ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ సదస్సులో చర్చించిన అంశాలపై వివిధ శాఖలు తీసుకున్న చర్యలపై కలెక్టర్, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. 35 శాఖల అంశాలను అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల నుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని, నిధులు మంజూరు చేసేంత వరకు పంచాయతీ సెక్రటరీ, వీఆర్వోల ఆధ్వర్యంలో పైపులైన్ల పర్యవేక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ ఎస్ఈని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు వర్చువల్ తరగతులను వెంటనే ప్రారంభించాలన్నారు. తొలి దశలో అన్ని ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు.

### దీపం-2కు ఆదరణ

**కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** దీపం-2 పథకంపై మహిళల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. నవంబరు 18 నాటికి బుక్ చేసుకున్న మొత్తం సిలిండర్లు 42.43 లక్షలు, డెలివరీ చేసినవి 33.44 లక్షలు. దీపం-2 పథకం ద్వారా లబ్ధి పొందిన 28.86 లక్షల మంది మహిళలకు ప్రభుత్వం రూ.229 కోట్లు విడుదల చేసింది. మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.182 కోట్లు జమ అయింది. ఇది ప్రభుత్వం విడుదల చేసిన మొత్తంలో 79.52 శాతం. దీపం-2 పథకం సూపర్ హిట్ అనేందుకు ఈ లెక్కలే నిదర్శనం. సాంకేతిక కారణాలతో 2,758 మంది లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాని మొత్తం రూ.21.78 లక్షలు మాత్రమే.

## ఇద్దరు రైతుల బలవన్మరణం


7

## ఎండుమిర్చి ధర పైపైకి..

క్వింటా గరిష్ఠంగా రూ.15,513

# గోడు వినండి..!

- తుంగభద్ర బోర్డు అకౌంట్ ఫ్రీజ్
- ఉద్యోగులకు జీతాలు లేనట్టే
- ఆందోళనలో టీబీపీ సిబ్బంది
- ఉద్యోగులకు శాపంగా వైసీపీ నిర్వాకం



**కర్నూలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** తుంగభద్ర బోర్డు పనుల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు ప్రస్తుతం బోర్డు ఉద్యోగుల పాలిట శాపంగా మారాయి. మూడు నెలలుగా జీతాలు అందక ఆర్థిక అవస్థలు పడుతున్నారు. బోర్డు అకౌంట్ ఫ్రీజ్ తొలగించి.. నవంబరు ఆఖరులో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఖర్చు చేయకపోతే వెనక్కి వెళ్తాయని, అదే జరిగితే వచ్చే ఏడాది మే వరకు జీతాలు కూడా వచ్చే అవకాశం ఉండదని బోర్డు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర బోర్డు పనుల్లో అవినీతి అక్రమాలు జరిగి ఉంటే.. సంబంధిత కాంట్రాక్టర్లపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) విచారణ చేయించాలి. అవసరమైతే చట్టరమైన చర్యలు తీసుకోవాలే కానీ ఇలా ఖాతాలను సీజ్ చేసి నిధులు లేకుండా చేయడం ఏమిటని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర కాలువ ఆధునికీకరణ పేరిట దాదాపు రూ.919 కోట్లకు టెండర్లు పిలిచారు. తొలి దశలో రూ.519.80 కోట్లతో ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనులు చేస్తే.. సుమారు రూ.350 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. రెండవ దశలో మరో రూ.400 కోట్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఈ పనుల్లో వైసీపీ హయాంలో బోర్డులో పని చేసిన ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, ఏపీ ప్రభుత్వం ఓ ఈఎన్‌సీతో పాటు బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన బడా కాంట్రాక్టర్ ఒకరు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కాంట్రాక్టరు గత ఎన్నికల్లో ప్రకాశం జిల్లా గిద్దలూరు వైసీపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక తుంగభద్ర బోర్డు పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిని నిగ్గు తేల్చాలని అనంతపురం జిల్లాకు చెందిన రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ప్రభుత్వానికి లేఖ రాశారు. బోర్డు పనుల్లో అక్రమాలపై విచారణ చేసి నిగ్గు తేల్చే వరకు తుంగభద్ర బోర్డుకు కేటాయించిన నిధులు వినియోగించకూడదని, ఎలాంటి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) ఇవ్వవద్దని ఏపీ ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీ టీబీపీ బోర్డు కార్యదర్శి, కర్ణాటక ప్రభుత్వం ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయడం.. ఆ వెంటనే బోర్డు ఖాతాను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.

మిగతా 6లో..

# వివాదాల ఆలూరు

- పోలీసు స్టేషన్‌పై పట్టు కోసం అధికార పార్టీ నేతల మధ్య పోటీ
- విధుల్లో చేరిన నాలుగు నెలలకే వీఆర్‌లోకి ఇద్దరు పోలీసు అధికారులు
- అధికారుల మధ్య విభేదాలకు ఆజ్యం పోస్తున్న కింది స్థాయి ఉద్యోగులు

**ఆలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :** ఆలూరు పోలీసు సర్కిల్ స్టేషన్ వివాదాలకు నిలయంగా మారింది. విధుల్లో చేరిన నాలుగు నెలలకే ఇద్దరు పోలీసు అధికారులు వీఆర్‌లోకి వెళ్లడం చర్చనీయాంశమైంది. అధికార పార్టీలో నేతల మధ్య ఉన్న వర్గ విభేదాల కారణంగా నాలుగు నెలల వ్యవధిలో సీఐ శ్రీనివాస నాయక్, ఎస్ఐ వెంకట నరసింహులు వీఆర్‌లోకి వెళ్లారని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక ఆలూరు సర్కిల్ సీఐగా శ్రీనివాస నాయక్, ఎస్సైగా వెంకట నరసింహులుకు అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే, టీడీపీ ముఖ్య నేత ఒకరు కలిసి పోస్టింగ్ ఇప్పించారు. అయితే అదే పార్టీలో ఉన్న మరో నేతకు పోలీసు స్టేషన్‌లో వారి పెత్తనం మింగుడు పడలేదు. పోలీసులు తాము చెప్పిన పని చేయడం లేదని జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఇద్దరు పోలీసు అధికారులు ఒకే వర్గానికి పని చేసి విధంగా వ్యవహరిస్తున్నారని చర్యలు తీసుకున్నారు.





ఆలూరు పోలీసు స్టేషన్

### ఇద్దరు అధికారుల వీఆర్‌కు కారణాలెన్నో..?

ఆలూరు పోలీసు సర్కిల్‌లో ఇద్దరు పోలీసు అధికారులపై చర్యలకు అవినీతి ఆరోపణలు కారణమని పోలీసు ఉన్నతాధికారులు చెబుతుండగా మరో అంశం కూడా తెరపైకి వచ్చింది. వాస్తవంగా నియోజకవర్గంలో పేకాట స్థావరాలపై ఓ అధికార పార్టీ నేత పోలీసులకు సమాచారం ఇచ్చి అరెస్టు చేయించగా అందులో మరో నేత అనుచరులు పట్టుబడ్డారు. దీంతో ఇద్దరి నేతల మధ్య వర్గాల మధ్య ఈ ఘటన ఆజ్యం పోసినట్టయింది. తమ అనుచరులనే అరెస్టు చేస్తారా అంటూ ఓ నేత పోలీసుల తీరుపై ఆగ్రహించినట్లు సమాచారం. మరో వైపు ఓ టీడీపీ నేత ఫిర్యాదు మేరకు ఆలూరులోని క్లబ్‌ను ఎస్సై మూసివేయడంతో మరోవర్గం నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికార పార్టీ వర్గ పోరు వల్లే ఆలూరు పోలీసు స్టేషన్‌లో ఇద్దరు అధికారులు బలి అయినట్లు తెలుస్తోంది.

మిగతా 6లో..

# ఆన్‌లైన్‌లో పాసు పుస్తకాల మార్పు

- రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకుల వ్యవహారం
- వలస వెళ్లాక ఈ పని చేశారంటున్న బాధితులు

**కోసిగి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** సొంతూరులో పనులు లేక పిల్లా పాపలతో బొంబాయికి వలస వెళ్లిన వాళ్ల పొలాన్ని వైసీపీ నాయకుల ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో పాసుపుస్తకాలు మార్చేశారు. ఈ ఘటన మండలంలోని కందుకూరు గ్రామంలో జరిగింది. గూడ్ల ఈరన్న, గూడ్ల తాయప్ప, వారి కుటుంబ సభ్యులు బుధవారం కోసిగి విలేకరుల ముందు ఈ విషయం తెలిపారు. కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్‌లకు తమ సమస్యలు లిఖిత పూర్వకంగా అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ఈరన్న, తాయప్ప మాట్లాడుతూ కందుకూరు గ్రామంలోని సర్వే నెం.352ఏ, 352బీలో 17.81 ఎకరాల పొలం తమకు ఉన్నదని తెలిపారు. ఊళ్లో పనులు లేకపోవడంతో తమ కుటుంబ సభ్యులతో కలిసి బొంబాయి, గుంటూరు పట్టణాలకు వలస వెళ్లిన సమయంలో అప్పటి గ్రామ రెవెన్యూ అధికారులు, స్థానిక వైసీపీ నాయకుల ప్రోద్బలంతో తమ భూమి పాసు పుస్తకాలను గ్రామానికి చెందిన దోసయ్యగారి రామన్న కుమారులు అయ్యన్న, చిన్న రామన్న, నరసింహులు, దేవేంద్ర పేర్ల మీద ఆన్‌లైన్‌లో మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగెకరాలను వారి పేర్ల మీద పాసు పుస్తకాలు చేశారని, మిగతా 13.54 ఎకరాల పొలం కూడా వారే ఆధీనంలోకి తీసుకొని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామంలోని వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే రెవెన్యూ అధికారులు తమ పేర్లను మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు. కోసిగి సీఐ మంజునాథ్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేస్తున్న కందుకూరు వాసులు



### విద్య, వైద్య సేవలు అందించడమే ధ్యేయం

తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్య సేవలు అందించడమే ధ్యేయం. చైతన్య స్రవంతి కార్యక్రమం ద్వారా జానపద, సాహిత్య కళలు, కూచిపూడి తదితర సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వచ్చిన తెలుగు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందిస్తున్నాం. తానాతో పాటు నిరంజన్ శృంగవరపు ఫౌండేషన్ ద్వారా సామాజిక, సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నాం. క్యాన్సర్ మహమ్మారిని ముందుగానే గుర్తించేందుకు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మహిళా సాధికారతకు కృషి చేస్తున్నాం.

- శృంగవరపు నిరంజన్, తానా అధ్యక్షుడు



రాజనగరంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

సొంతూరిపై మమకారం..

స్ఫూర్తి

# పేదలకు అభయం

- ప్రవాసాంధ్రుడు.. సేవా నిరంజనుడు
- అగ్రరాజ్యంలో తెలుగు తేజం
- గ్రామీణ స్థాయి నుంచి అంచలంచెలుగా ..
- తెలుగు రాష్ట్రాల్లో సామాజిక, సేవా కార్యక్రమాలు
- తానా అధ్యక్షుడిగా శృంగవరపు నిరంజన్ విస్తృత సేవలు

కొందరు ఎంత ఎత్తు ఎదిగినా సొంతూరిని మర్చిపోలేరు. విదేశాల్లో ఉంటూ పుట్టి పెరిగిన ఊరిలో నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటారు. కన్నతల్లిని.. పుట్టిన ఊరిని మర్చిపోకూడదనే ఏకైక లక్ష్యంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు శృంగవరపు నిరంజన్. ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికాలోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) అధ్యక్షుడిగా అక్కడి తెలుగు వారితో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో శృంగవరపు నిరంజన్ విశేష సేవలు అందిస్తున్నారు. మారుమూల గ్రామంలో పుట్టి అరకొరగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని కృషి, పట్టుదలతో శ్రమించి ఉన్నత చదువులు చదివి ఖండాంతరాలు దాటి అమెరికాలో స్థిరపడిన నిరంజన్ ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కన్నఊరి రుణం తీర్చుకుంటున్నారు.

### తానాలో చిరకాల సేవలు

- 2008లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం సభ్యుడిగా చేరారు.
- 2009-11లో నేషనల్ అడహక్ (ఫైనాన్స్ ఫండ్ రైజింగ్) కమిటీ చైర్మన్‌గా పని చేశారు.
- 2013-15లో తానా ఫౌండేషన్ ట్రస్టీగా సేవలందించారు.
- 2015 నుంచి 2017 వరకు తానా ఫౌండేషన్ ట్రెజరర్‌గా, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా...
- 2017-18లో తానా ఫౌండేషన్ చైర్మన్‌గా, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా పని చేశారు.
- 2017-19లో తానా ఫౌండేషన్ ట్రస్టీగా, బైలాస్ మెంబర్‌షిప్ వెరిఫికేషన్, ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు.
- 2023లో నిర్వహించిన తానా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. 2023 నుంచి 2025 వరకు తానా అధ్యక్షుడిగా సేవలు అందించనున్నారు.

### తెలుగు ప్రజల సంక్షేమం కోసం 'తానా'

ఉత్తర అమెరికాలోని తెలుగు ప్రజల సంక్షేమం కోసం తానా కృషి చేస్తోంది. తానా ఫౌండేషన్, టీం స్క్వేర్‌లు అంతర్భాగంగా తానా విశేష సేవలు అందిస్తోంది. అక్కడ జన్మించిన తెలుగు చిన్నారులకు పాఠశాల అనే కార్యక్రమం ద్వారా తెలుగు నేర్పుతున్నారు. ఏటా 4 వేల మంది వరకు తెలుగు అభ్యసిస్తున్నారు. అమెరికాలో మృతి చెందిన తెలుగు వ్యక్తుల మృతదేహాలను స్వదేశంలోని కుటుంబసభ్యులకు అప్పగించేందుకు టీం స్క్వేర్ ద్వారా సహకారం అందిస్తున్నారు. చదువుకునేందుకు వచ్చిన, ఉద్యోగాలు చేస్తున్న తెలుగు వ్యక్తులు రహదారి ప్రమాదాలకు గురైనా.. నివాసాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి ఇబ్బందుల్లో ఉన్నా టీం స్క్వేర్ ద్వారా సేవలు అందిస్తున్నారు. అమెరికాలో సాంస్కృతిక, సామాజిక, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ అగ్రరాజ్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా చేస్తున్నారు.

### ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవలు

సర్వేశ చారిటబుల్ ట్రస్ట్, నిరంజన్ శృంగవరపు ఫౌండేషన్(ఎన్ఎస్ఎఫ్) ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నిరంజన్ స్వగ్రామమైన రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో వెయ్యి డాలర్లతో లైబ్రరీని ఏర్పాటు చేయించారు. గ్రామంలో రామాలయం నిర్మాణం కోసం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఖమ్మం జిల్లా గోల్డెన్ పహాడ్‌లో రూ.6 లక్షలతో సురక్షిత మంచినీటి ప్రాజెక్టును నిర్మించారు. రాజనగరంలో రూ.7 లక్షలు వెచ్చించి అత్యాధునిక వైద్య సామగ్రితో కంటి వైద్య శిబిరం నిర్వహించి శస్త్రచికిత్సలు చేయించారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి పది వేల డాలర్లను అందజేశారు. ఏపీ, తెలంగాణలోని ప్రతిభ కలిగిన వందలాది విద్యార్థులకు ఉపకార వేతనాలు, ల్యాప్‌టాప్‌లతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వారికి అవసరమైన ఆర్థిక, సామాజిక ప్రోత్సాహాన్ని అందజేశారు. దొర్నిపాడు మండలం బుర్రారెడ్డిపల్లెలో శుద్ధజల కేంద్రాన్ని నిర్మించారు. రాజనగరం, గాంధీనగరం, గుంప్రమాన్‌దిన్నెలోని విద్యార్థులకు సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.



సమాజసేవ గురించి సినీ యాక్టర్ సోనూసూద్‌తో

**శిరివెళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం రాజనగరం గ్రామానికి చెందిన శృంగవరపు సుబ్రహ్మణ్యం, ఇంద్రావతి దంపతుల మొదటి కుమారుడు శృంగవరపు నిరంజన్. తల్లిదండ్రులకు వ్యవసాయమే జీవనాధారం. తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో నిరంజన్ పదో తరగతి వరకు స్వగ్రామమైన రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ యర్రగుంట్ల ప్రభుత్వ కళాశాలలో చదివారు. కర్ణాటకలోని గుల్బర్గా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పట్టా సాధించి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ ఐటీ రంగంలో రాణించేందుకు 2001లో అమెరికా వెళ్లారు. అనంతరం 2003లో ఐటీ బిజినెస్ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్‌లోకి ప్రవేశించ డానికి ముందు డైమ్లెర్ క్రిస్లర్, ఐబీఎం సంస్థల కోసం పని చేశాడు. అనంతరం అమెరికాలో ఐటీ రంగానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని డెట్రాయిట్‌లోని నోవిలో 2003లో సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించారు.

### 'తానా' కోసం తన వంతుగా..

ప్రపంచంలో ఉన్నత శ్రేణికి చెందిన లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థల్లో ఒకటైన తానా అభివృద్ధికి నిరంజన్ తనవంతు బాధ్యతగా డబ్బును విరాళంగా ఇవ్వడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో సంస్థ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తానా ఫౌండేషన్‌లో వివిధ ప్రాజెక్టుల కోసం తెలుగు సంఘం నుంచి 50 వేల డాలర్లను సేకరించారు. అండర్ ప్రివిలేజ్డ్ పిల్లలను పెంచడం, వారి సహాయం కోసం చేయూత స్కాలర్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించారు. వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీకి ఆదరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల్లోని విద్యార్థుల కోసం 25కు పైగా లైబ్రరీ ప్రాజెక్టులను ఏర్పాటు చేయించారు. కొవిడ్-19 సహాయ చర్యల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో లక్ష కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లు, 3 లక్షల మందికి ఆహారం పంపిణీ, 6 లక్షల ఫేస్ మాస్కులు పంపిణీ చేశారు. ఇటీవల విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం తానా ఫౌండేషన్ ద్వారా రూ.1.10 కోట్ల విలువ చేసే నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు.



నిరంజన్‌ను సన్మానిస్తున్న శిరివెళ్ల మండల ప్రజలు



అమెరికాలో విద్యార్థులకు బ్యాక్ ప్యాక్‌లు పంపిణీ

## బాలల హక్కులను పరిరక్షించాలి

### జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది



బహుమతులు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

**కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** బాలల హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది అన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు చెడు అలవాట్లకు లోనుకాకుండా సన్మార్గంలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, డిప్యూటీ డీఈవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిశీలన గృహంలో బాలల దినోత్సవ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పరిశీలన గృహం సూపరింటెండెంట్ హుశేన్‌బాషా, ఐసీడీఎస్ చైర్‌పర్సన్ జుబేదాబేగం, న్యాయవాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్- 2 సిల్వర్ జూబ్లీ అధ్యాపకురాలికి అరుదైన గౌరవం

## అంతర్జాతీయ సెమినార్‌కు ఫమీదా బేగం

### సిల్వర్‌జూబ్లీ కళాశాల అధ్యాపకురాలికి అరుదైన గౌరవం



**కర్నూలు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** అంతర్జాతీయ సెమినార్‌కు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకురాలు ఫమీదా బేగం ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ తెలిపారు. అమెరికాలో జరుగుతున్న 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో పత్ర సమర్పణ చేయడానికి ఆమెకు అవకాశం వచ్చిందని తెలిపారు. దోహాఖతర్, ఆంధ్ర కళావేదిక దోహాఖతర్, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో అధ్యాపకురాలికి గౌరవ దక్కడం అభినందనీయమని క్లస్టర్ వర్శిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు.

## పులి కూనల్లా పిల్లి పిల్లలు

### పరిశీలించిన అటవీ శాఖ అధికారులు



జంగంపిల్లి కూనలు

**కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** కొత్తపల్లి పరిసరాల్లో పులి కూనల్లా కనిపిస్తున్న పిల్లి పిల్లలను రైతులు గమనించారు. చివరకు అవి జంగం పిల్లి పిల్లలని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రం నుంచి హరిహరం వెళ్లే రహదారిలో గోవిందు అనే రైతు పొలంలో నాలుగు కూనలు రైతులకు బుధవారం కంట పడ్డాయి. అటువైపు వెళ్తున్న రైతులు గమనించి అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అవి పులి కూనలు కావని, జంగంపిల్లి పిల్లలేనని ఎఫ్ఎస్‌వో జ్యోతి స్వరూప్ తెలిపారు. సాయంత్రం వరకు అటవీ శాఖ సిబ్బందిని భద్రంగా ఉంచామని, తల్లి తన పిల్లలను తీసుకెళ్లిందని చెప్పారు.

### ఆత్మకూరు పోలీసులకు మంత్రి లోకేశ్ అభినందన

**ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** ప్రమాదవశాత్తు బావిలో పడిన వృద్ధురాలిని కాపాడిన ఆత్మకూరు పోలీసులను మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదిక ద్వారా బుధవారం అభినందించారు. ఈ నెల 18న ఆత్మకూరు మండలంలోని ముష్టేపల్లి గ్రామానికి చెందిన ఖాదరమ్మ అనే వృద్ధురాలు పంట పొలాల్లోని బావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. ఆమె కేకలు విని ఆ పక్కనే రహదారిపై వెళ్తున్న ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ మౌలాలి, హోంగార్డు చక్రపాణి వృద్ధురాలిని కాపాడురు. కలెక్టర్ ఆదిరాజ్‌సింగ్ రాణా ఈ ఇద్దరు పోలీసులను అభినందించారు. ఈ విషయం మీడియా, సోషల్ మీడియా ద్వారా మంత్రి నారాలోకేష్ దృష్టికి వెళ్లింది. పోలీసుల సాహసోపేతమైన ప్రయత్నాన్ని బుధవారం ఎక్స్ వేదిక ద్వారా అభినందించారు.




ఎక్స్ వేదిక ద్వారా ఆత్మకూరు పోలీసులను అభినందించిన నారా లోకేష్

## వివాదాల ఆలూరు

(5వ పేజీ తరువాయి)

### సీఐ, ఎస్సై మధ్య విభేదాలకు ఆజ్యం పోసిన చిన్న బాస్‌లు

ఆలూరు పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనివాస నాయక్, ఎస్సై వెంకట నరసింహులు మధ్య విభేదాలు ఏర్పడటానికి అందులో ఉన్న సీనియర్ కానిస్టేబుల్ ఒకరు, మరో చిన్న బాసులే కారణమని పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎస్సైను వీఆర్‌కు పంపుతూ ఆయన స్థానంలో సత్య సాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న దిలీప్ కుమార్‌ను నియమిస్తూ ఈ నెల 12నా డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ ఇద్దరు సిబ్బంది సంబరాలు చేసుకున్నట్లు సమాచారం.

### ఎస్సై వీఆర్‌ను నిలుపుదల చేసేందుకు అన్ని వర్గాల యత్నాలు

'విధుల్లో చేరి మూడు నెలలు కూడా పూర్తి కాలేదు.. అన్ని వర్గాలు, అధికారులకు పని చేశాను, ఏం తప్పు చేశానని వీఆర్‌కు పంపించారు.. మీరే సహాయం చేయండి' అంటూ సదరు ఎస్సై అధికార పార్టీలోని ముఖ్యనేతల ఎదుట వాపోయినట్లు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన ఓ ఎమ్మెల్యే ఇద్దరు అధికార పార్టీ ముఖ్య నేతలు ఉన్నతాధికారులతో ఎస్సైను బదిలీ చెయ్యొద్దని కోరగా ఉన్నత అధికారులు ససేమీరా అన్నట్లు తెలిసింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకట చలపతి, ఎస్సై దిలీప్ కుమార్‌లు ఎన్ని రోజులు కొనసాగుతారో చూడాలి. అధికారుల మధ్య విభేదాలు సృష్టిస్తున్న ఆ ఇద్దరు సిబ్బందిపై కూడా ఇంటెలిజెన్స్ నివేదికలు జిల్లా ఉన్నత అధికారులకు వెళ్లాయి. వారిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసు వర్గాల సమాచారం.



వీఆర్‌లోకి వెళ్లిన సీఐ శ్రీనివాస్ నాయక్



వీఆర్‌లోకి వెళ్లిన ఎస్సై నరసింహులు

## గోడు వినండి..!

(5వ పేజీ తరువాయి)



తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) సీసీ లైనింగ్ పనులు (ఫైల్)

తుంగభద్ర బోర్డుకు ఏపీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌లో కేటాయించిన నిధులు ఈ నెల 30వ తేదీలోగా వినియోగించుకోవాలని 11వ తేదీన సర్క్యులర్ మెమో నంబరు.ఎఫ్ఐఎన్02-15069/11/2024-ఇ-ఎస్ఈసీ-డీటీఏలో స్పష్టంగా పేర్కొన్నారు. సీఎఫ్ఎంఎస్ బడ్జెట్ ఆర్డర్ నంబరు.4400014207, 55500014351లో కేటాయింపులు చేసిన నిధులు 2024-25కు సంబంధించి 2వ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రకారం ఆగస్టు 1 నుంచి నవంబరు 30వ తేది వరకే ఉంటుంది. అంటే ఆయా హెడ్ ఆఫ్ అకౌంట్స్ కింద అందుబాటులో ఉన్న బడ్జెట్‌ను ఈ నెల 30వ తేదీలోగా వినియోగించుకోవాలి. లేని పక్షంలో బడ్జెట్ వెనక్కి వెళ్తుందని అంటున్నారు. బోర్డు అకౌంట్‌ను ఫ్రీజ్ చేయడంతో ఆ నిధులు ఎలా వినియోగించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కర్ణాటక ప్రభుత్వానికి లేఖ రాసి బోర్డు అకౌంట్ ఫ్రీజ్ తొలగించాలని, బోర్డు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని తుంగభద్ర బోర్డు వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టీకే గోపాల్‌కృష్ణ విన్నవిస్తున్నారు. మరో పక్క బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ కాంట్రాక్టర్ సహా మరో మరికొందరితో పెండింగ్ బిల్లులు చెల్లింపు, అగ్రిమెంట్ చేసిన రూ.400 కోట్లు టెండర్లు రద్దు చేయకుండా కొనసాగించేలా అనంతపురం జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపినట్లు సమాచారం.

## హాస్టల్ విద్యార్థులకూ ఫేస్ రికగ్నేషన్

- జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 3 హాస్టళ్ల ఎంపిక
- ఇక బోగస్ అటెండెన్స్‌కు చెక్

**కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఫేస్ రికగ్నేషన్ (ఎఫ్ఆర్ఎస్)పద్ధతిని అమలులోకి తెచ్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగానే తొలిదశలో ప్రయోగాత్మకంగా జిల్లాలో మూడు హాస్టళ్లను ఎంపిక చేసింది. ఆదోని పోస్ట్ మెట్రిక్ కళాశాల హాస్టల్, వెల్దుర్తి, కర్నూలు బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. జిల్లా బీసీ సంక్షేమ అధికారులు ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకొని సర్వీస్ ప్రొవైడర్‌కు అప్పగించనుంది. ఎఫ్ఆర్ఎస్ అమలు కోసం ప్రత్యేకంగా యాప్‌ను ఆయా వసతి గృహాలకు చెందిన హాస్టల్ సంక్షేమ అధికారికి అప్పగించనున్నారు. ఎంపిక చేసిన ప్రతి హాస్టల్‌కు చెందిన విద్యార్థుల ఫొటోలు తీసి, ఆధార్, ఫోన్ నంబర్, చిరునామా తరగతి తదితర వివరాలను యాప్‌లో అప్లోడ్ చేస్తారు. తద్వారా యాప్ ఉన్న మొబైల్ ఫోన్, పరికరాలోనూ విద్యార్థి ముఖం చూపిస్తే హాజరు నమోదవుతుంది.

ఉదయం ప్రార్థన, సాయంత్రం స్కూల్ సమయం తర్వాత ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేస్తారు. దీని ద్వారా ఏ వసతి గృహంలో ఏ రోజు ఎంత మంది విద్యార్థులు ఉన్నదీ తెలుస్తుంది. ఈ విధానం వలన హాస్టళ్లలో బోగస్ హాజరుకు చెక్ పడుతుంది. బోగస్ హాజరు చూపి బిల్లులు డ్రా చేసుకొని ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసేందుకు వీలుండదు.




### వార్డెన్ల గుండెల్లో దడ..

బీసీ వసతి గృహాల్లో ఎఫ్ఆర్ఎస్ అమలవుతుండడంతో వార్డెన్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తమ అవినీతికి చెక్ పడుతుందని ఈ విధానాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర స్థాయిలో కొంత మంది వార్డెన్లు పై స్థాయి అధికారుల ద్వారా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది.

### జిల్లాల్లో మూడు హాస్టళ్లు ఎంపిక



జిల్లాలోని కర్నూలు, వెల్దుర్తి, ఆదోని వసతి గృహాల్లో ఫేస్ రికగ్నేషన్ విధానం అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. డిసెంబరు నెల నుంచి ఇది అమలు చేయాలని రాష్ట్రస్థాయి అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం.

-వెంకటలక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ సాధికారత జిల్లా అధికారి

## జీడీపీ నీరు విడుదలయ్యేనా?

- రబీ సాగు కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు
- సాగుకు సిద్ధంగా 13 వేల ఎకరాలు
- కలెక్టర్ దగ్గర ఇరిగేషన్ ఎస్-ఈ లెటర్



గాజులదిన్నె ప్రాజెక్టులో నిలువ ఉన్న నీరు

**గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులైనా ఇంత వరకు గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల కాలేదు. రైతులు పంట భూములను సాగుకు సిద్ధం చేసుకొని నీరు విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు కింద 25వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ఈ రబీలో 13వేల ఎకరాల వరకు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. అయితే అధికారులు నీరు ఎప్పుడు విడుదల చేసేది తెలియక ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అందిన సమాచారం మేరకు ఇప్పటి వరకు ఐఏబీ సమావేశం జరగక పోవడంతో నీటి విడుదల ఎప్పుడు ఎన్ని వేల ఎకరాలకు సాగు నీరు విడుదల చేయాలనే విషయంపై స్పష్టత రాలేదు. ఇప్పట్లో ఐఏబీ సమావేశం జరిగే సూచనలు కనిపించకపోవడంతో రెండు రోజుల క్రితం ఇరిగేషన్ ఎస్ఈ గాజులదిన్నె ప్రాజెక్టుకు రబీ సీజన్‌లో నీటి విడుదల కోసం అనుమతి కోరుతూ కలెక్టర్‌కు ఒక లెటర్ తయారు చేసి పంపినట్లు విశ్వసనీయ సమాచారం. దాన్ని కలెక్టర్ పరిశీలించి నీటి విడుదలకు అనుమతి ఇవ్వవలసి ఉంది. ఈ నెల ఆఖరులోపు నీరు విడుదల చేయవచ్చని అనాధికారిక సమాచారం.



గాజులదిన్నె ప్రాజెక్టు కింద సాగుకు సిద్ధం చేసుకున్న ఆయకట్టు భూమి

# కర్నూలులో హైకోర్టు బెంచ్..!

(5 పేజీ తరువాయి)

## ఐదేళ్లు మభ్యపెట్టిన వైసీపీ..

శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాలి.. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు డిమాండ్‌తో 2018 నవంబరు 16న రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో సీమ ప్రజా సంఘాల సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు, విద్యార్థులతోపాటు ప్రజా సంఘాలు వివిధ రూపాల్లో పోరాటాలకు సై అన్నాయి. ఆ సమయంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని అనాటి సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లోనూ ఇదే హామీ ఇచ్చారు. అయితే అప్పట్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం బాధ్యతలు చేపట్టాక మూడు రాజధానులు పేరిట మాయ చేశారు. కర్నూలు న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామంటూ సీమ ప్రజలను ఐదేళ్లు మభ్యపెట్టారు. జిల్లాకు చెందిన నాటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జగన్నాథగట్టుపై చుట్టూ 25 కిలోమీటర్లు అందంగా కనిపించే హైకోర్టు భవనం నిర్మిస్తామని ఎస్టీబీసీ కాలేజీ వేదికగా జరిగిన సీమ గర్జన సభలో గర్జించారే తప్పా ఆచరణలో పెట్టలేదు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం సభలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామనే హామీకి టీడీపీ కట్టుబడి ఉంది. తమ కూటమి ప్రభుత్వం రాగానే బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు అదే హామీని ప్రజల్లోకి తీసుకెళ్లారు.



కర్నూలు నగరంలోని జిల్లా కోర్టు

### బెంచ్ ఏర్పాటుకు అడుగులు.. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ

ప్రజాగళం సందర్భంగా 'కర్నూలులో హైకోర్టు బెంచ్' ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. న్యాయ సమీక్షలో కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలి కోరుతూ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీత అక్టోబరు 28న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఆవశ్యకతను స్పష్టంగా ఆ లేఖలో వివరించారు. ఇది ప్రజల డిమాండ్. ప్రజాగళంలో స్పష్టమైన హామీ ఇచ్చారు. 1952లో కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత రాజధాని హైదరాబాద్‌కు రాజధాని వెళ్లింది. 2014లో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత రాజధాని, హైకోర్టు అమరావతికి మార్చారు. దేశంలో పలు రాష్ట్రాల్లో హైకోర్టులు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. బెంచ్ ఏర్పాటు కోసం ప్రధాన న్యాయమూర్తి, ప్రభుత్వం కలిసి అంగీకరించాల్సి ఉంది. రాయలసీమ ప్రాంతం 2022లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత 8 జిల్లాలుగా ఉన్నాయి. రాష్ట్ర జనాభాలో 25 శాతం 1.59 కోట్లు. వైశాల్యంలో 43 శాతం రాయలసీమ జిల్లాలే ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి అమరావతిలోని హైకోర్టుకు వెళ్లడం సామాన్యులకు కష్టంగా ఉంది. కర్నూలు నుంచి విజయవాడకు రైలు రవాణా సౌకర్యం కూడా లేదు. రాయలసీమ ప్రాంతానికి కర్నూలు కేంద్రం కావడంతో అక్కడ హైకోర్టు బెంచ్ ఏర్పాటు అవసరం ఉందని ఆ లేఖలో ప్రభుత్వం పేర్కొంది. అదే క్రమంలో బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రివర్గ సమావేశంలో కూడా తీర్మానం చేశారు.

**కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి తీరుతాం**



శ్రీబాగ్ ఒడంబడిక అమలులో సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారు. హైకోర్టు బెంచ్‌తో పాటు కృష్ణా జలాలు వినియోగంలోనూ టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. వైసీపీ ప్రభుత్వం లాగా మాటలతో మాయ చేయడం చంద్రబాబుకు రాదు. బెంచ్‌పై ఇప్పటికే హైకోర్టుకు లేఖ రాశాం.. మంత్రివర్గం సమావేశంలో తీర్మానం కూడా చేశాం. లోకాయుక్త, ఏపీ మానవ హక్కుల కమిషన్‌లు కర్నూలులోనే ఉంటాయని మంత్రివర్గంలో సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారు.

**- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి**

## హైకోర్టు బెంచ్ పట్ల హర్షం

- సీఎం ఫ్లెక్సీకి న్యాయవాదుల క్షీరాభిషేకం

**కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించడం పట్ల కర్నూలు న్యాయవా దులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో, యువగళం సందర్భంగా నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు రాష్ట్ర క్యాబినెట్ బుధవారం అంగీకరించింది. దీంతో న్యాయవాదులు సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభి షేకం చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు సాధన జేఏసీ కన్వీనర్ వై.జయరాజు మాట్లాడుతూ హైకోర్టు బెంచ్‌ను సాధ్యమైనంత తొందరలో ఏర్పాటు చేయాలని కోరారు. కర్నూలులో ఉన్న మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్స్‌ను కర్నూలులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, బీజేపీ లీగల్ సెల్ నాయకుడు మోహన్ ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం ప్రకటించారు.




క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ లీగల్ సెల్ నాయకుడు మోహన్

## పోలీసు అదుపులో మట్కా డాన్..!

**ఆదోని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఆదోనిలో గుట్టుచప్పుడు కాకుండా మట్కా కార్యకలాపాలను నిర్వహిస్తున్న మట్కా డాన్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. ఆలూరు మండలం కమ్మరచేడు స్వగ్రామం కాగా బళ్లారిలో స్థిర నివాసం ఉంటున్నాడు. అక్కడి నుంచే మట్కా కార్యకలాపాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆదోనిలో తన తమ్ముడి సహకారంతో ఈ వ్యవహారం నడుపుతున్నాడు. ఆదోని త్రీ టౌన్ పోలీసులు పక్కా సమాచారంతో వల పన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై త్రీ టౌన్ సీఐ రామలింగమయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ తర్వాత బయటకు చెప్పగలమని తెలిపారు.

## ఆకతాయికి జైలు శిక్ష

**బండిఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పెద్దిరాజు అనే ఆకతాయికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. బుధవారం గ్రామంలో అల్లరికి పాల్పడిన పెద్దిరాజును కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి శిక్ష విధించారన్నారు

## ఆరేకల్లులో చైన్‌స్నాచింగ్

**ఆదోని రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఆదోని మండలం ఆరేకల్లులో చైన్ స్నాచింగ్ జరిగింది. ఓ లెక్చ రర్ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును తెంచుకొని దొంగలు పరార య్యారు. ఆదోని పట్టణం హనుమాన్ నగర్‌లోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న పార్వతి ఆరేక ల్లులోని ములుగుందం రహదారిలో ఉన్న గురుకుల బాలికల పాఠశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కాలేజీ బయ టకు రాగానే ద్విచక్ర వాహనం మీద వచ్చిన దంపతులు లెక్చరర్ పార్వతి మెడలో ఉన్న గొలుసును తెంచుకెళ్లారు. దొంగల ప్రతిఘటనలో పార్వతి మెడకు గాయమైంది. బాధితురాలు తాలుక పోలీ సులను సంప్రదించింది. సీసీ ఫుటేజీల ద్వారా దొంగలను గుర్తిస్తు న్నామని, విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

## కొలనుభారతి పురోహితునికి నోటీసు



పురోహితునికి నోటీసులు ఇస్తున్న ఈవో

**కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** భక్తుల మనోభా వాలను దెబ్బతినే విధంగా ప్రవర్తించిన కొలనుభారతి ఆలయ పురోహితులు చక్ర పాణి శర్మకు ఈవో రామలింగారెడ్డి బుధ వారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 16న తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా బూత్పూర్ మండలానికి చెందిన కొంత మంది భక్తులు కొలనుభారతి అమ్మవారి దర్శనం వచ్చారు. ఆ సమ యంలో వారి పట్ల పురోహితులు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కొంత నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈవో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. పురోహితుడు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో నోటీసులు జారీ చేసినట్లు ఈవో పేర్కొ న్నారు. వీటిపై పది రోజుల్లో సంజాయిషీ కోరినట్లు ఈవో చెప్పారు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం : రామలింగారెడ్డి, ఈవో**

ఈ నెల 25వ తేదీన కొలనుభారతి క్షేత్రంతో పాటు సప్తశివాల యాల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. పురోహి తులు, సిబ్బంది సమయపాలన పాటించేవిధంగా ఎవరు ఏయే సమయంలో వస్తున్నారనే వాటిపై కూడా బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తున్నాం. అంతేగాకుండా ఆలయాన్ని ఎన్ని గంటలకు తెరవాలి. ఏ సమయంలో మూసివేయాలనే వాటిపై కూడా పరిశీలిస్తున్నాం.

## తుగ్గలి నాగేంద్రకు గన్‌మెన్ల కేటాయింపు



గన్‌మెన్‌తో తుగ్గలి నాగేంద్ర

**తుగ్గలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్రకు ప్రభుత్వం గన్‌మెన్లను మంజూరు చేసింది. ఫ్యాక్షన్ నేపథ్యం నాయకుడు కావడంతో ఆయనకు రక్షణగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ సందర్భంగా తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ తనకు ప్రాణహాని ఉందని గుర్తించిన ప్రభుత్వం గన్‌మెన్లను మంజూరు చేసిందని చెప్పారు. అందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేశ్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తామని చెప్పారు.

## బాబోయ్ దొంగలు..!

- రెండేళ్లుగా పని చేయని సీసీ కెమెరాలు
- పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి రైతుల అవస్థలు



వారం కిందట దొంగిలించిన ఉల్లిగడ్డల బస్తాలు

**కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధర లభిస్తుందనే నమ్మకంతో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా రైతులు పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకు వస్తున్నారు. అయితే.. కొంత మంది కేటుగాళ్లు పంట ఉత్పత్తులను ఎత్తుకెళ్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. రాత్రిపూట దొంగలు యార్డులో చొరబడి ఉల్లిగడ్డలు, వాము, తదితర వాటిని తీసుకెళ్తున్నారు. దొంగలను అదుపు చేయడంలో మార్కెట్ యార్డు అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో యార్డులో 73 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే.. ఈ సీసీ కెమెరాలను సక్రమంగా పని చేయడం లేదు. 73 సీసీ కెమెరాలకు గాను 40 సీసీ కెమెరాలే యార్డులో కనిపిస్తున్నాయి. కనీసం ఉన్న సీసీ కెమెరాలనైనా యుద్ధ ప్రాతిపదికన రిపేరు చేయించి తమ పంట ఉత్పత్తులను దొంగల బారి నుంచి కాపాడాలని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

**సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం**

గతంలో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులకు భద్రత ఉండేది. ఇటీవల దొంగల బెడద ఎక్కువైంది. రాత్రిపూట ఉల్లిగడ్డలతో పాటు తదితర పంట ఉత్పత్తులను కేటుగాళ్లు ఎత్తుకెళ్లిపోతున్నారు. రెండేళ్లుగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. 73 సీసీ కెమెరాలకు గాను 40 మాత్రమే ఉన్నాయి. వాటిని యుద్ధ ప్రాతిపదికన రిపేరి చేయించి పంట ఉత్పత్తులకు భద్రత కల్పిస్తాం. అదే విధంగా ఫోర్త్ టౌన్ పోలీసులు రాత్రి పూట యార్డులో తనిఖీకి వచ్చేలా చూడాలని పోలీసు అధికారులను కోరాం.

**- జయలక్ష్మి, మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ**

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**ఆదోని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :** టీ తాగేందుకని ఇంట్లోంచి బయటకు వెళ్లిన వ్యక్తి ఇక తిరిగి రాలేదు. తెల్లారి చేసేసరికి మురికి కాలువలో శవమయ్యాడు. ఆదోని పట్టణంలోని కొడలపేటకు చెందిన మహమ్మద్ గౌస్(28) బుధవారం తెల్లవారు జామున 4గంటల సమయంలో టీ తాగేందుకు ఇంటి నుంచి బయటకొచ్చాడు. తెల్లారేసరికి మురుగు కాలువలో శవమైతేలాడు. కాలువ పైన కత్తి ఉండడం, మృతుడి గొంతుపై కత్తి గాటు ఉండటం పోలీసులు గమనించారు. ఇది హత్యానా, ఆత్మహత్యనా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. సెంట్రింగ్ పని చేస్తున్న సయ్యద్ మహమ్మద్ గౌస్ మూడు నెలలుగా పనికి పోకుండా ఇంట్లోనే ఉంటున్నాడని, అతని మానసిక పరిస్థితి కూడా సరిగాలేదని, ఇంటి నుంచి కత్తి తెచ్చుకొని ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని సీఐ రామలింగమయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి సహేరాబాను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## ఎండు మిర్చి ధర పైపైకి..

**కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధర ఆకాశాన్నంటుతోంది. వారం రోజులుగా రైతులు ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున అమ్మకానికి తీసుకు వస్తున్నారు. బుధవారం క్వింటా ఎండు మిర్చి ధర గరిష్ఠంగా 15,513, మధ్యస్థ ధర రూ.6,709, కనిష్ఠ ధర రూ.1,699కి రైతులకు లభించిందని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అదేవిధంగా మినుములకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధరలు క్వింటానికి రూ.8,321 రైతులకు అందిందని తెలిపారు. సజ్జకు గరిష్ఠ, మధ్యస్థంగా రూ.2,169, కనిష్ఠంగా రూ.2,091 లభించిందని. కొర్రలకు గరిష్ఠ ధర రూ.3,309, మధ్యస్థం రూ.2,511, కనిష్ఠం రూ.2,449 రైతులకు నిర్ణయించారని సెక్రటరీ తెలిపారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.6,189, మధ్యస్థ రూ.5,410, కనిష్ఠ ధర రూ.3,610 దక్కింది. ఆముదాలకు గరిష్ఠం రూ.5,706, మధ్యస్థ రూ.5,686, కనిష్ఠం రూ.5,190 నిర్ణయించారు. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,246లు, మధ్యస్థం రూ.2,159లు, కనిష్ఠం రూ.2,125లు దక్కింది. శనగలకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.6,031 కాగా, ఉల్లి ధర వారం రోజులుగా తగ్గుతూ వస్తోంది. గరిష్ఠ ధర రూ.4,412, మధ్యస్థం రూ.3,891, కనిష్ఠం రూ.515 దక్కింది.



యార్డుకు అమ్మకానికి వచ్చిన ఎండుమిర్చి

## గ్రంథాలయాల ఆధునికీకరణకు సహకారం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో టీజీ వెంకటేశ్

**కర్నూలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయాల ఆధునికీకరణకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్స వాలు ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథు లుగా టీజీ వెంకటేశ్, కేవీఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి పుష్పమాల వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ యువత వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో పెట్టాలని అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్టడీ ల్యాబ్‌లో ఏసీతోపాటే అన్ని రకాల పుస్తకాలు అందజేస్తూ తగిన సౌకర్యాలు కల్పిస్తానని చెప్పారు. వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కేసీ కల్కూర, సాహితీ సదస్సు సంస్థ కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, విశ్రాంత ఇంజనీర్ ముచ్చుకోట చంద్రశేఖర్, నిఖిలేశ్ ఎడ్యుకేషన్ అకాడమీ అధ్యక్షుడు టి. మద్దులేటి, డిప్యూటీ లైబ్రేరియన్ వి. పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి పాల్గొన్నారు.

## ఇద్దరు రైతుల ఆత్మహత్య



వెంకటేశ్వర్లు(ఫైల్)



నూర్‌బాషా(ఫైల్)

**సి.బెళగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** అప్పుల బాధ తాళలేక కర్నూలు జిల్లాలోని వేర్వేరు మండలాల్లో బుధవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. సి.బెళగల్ మండలం చింతమానుపల్లె గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు (56) పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వర్లు తు తనకున్న 2 ఎకరాలతోపాటు మరొక 8 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, ఉల్లి, మిరప, ఆముదం, వేరుశెనగ పంటలను సాగు చేస్తున్నాడు. గత 5 సంవత్సరాలుగా పంటలు చేతికి రాక అప్పులపాలయ్యాడు. బుధవారం పొలానికి వెళ్లి పత్తి పంటకు పిచికారి చేయడానికి తెచ్చుకున్న పురుగుల మందుతాగి పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు పక్కల పొలాల వారు చూసి కుటుంబసభ్యులకు తెలియజేశారు. అప్పులు రూ 15 లక్షలు ఉంటాయని, తిరిగి చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య గిడ్డమ్మ, నలుగురు కూతుర్లు, ఒక్క కుమారుడు ఉన్నారు.

**ఓర్వకల్లు:** అప్పుల బాధ తాళలేక కాల్వ గ్రామంలో యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన తాతేగాల్ల నూర్‌బాషా(30) ఏడేళ్లుగా గ్రామంలో ఇతర రైతుల కొబ్బరి చెట్లను కౌలుకు తీసుకొని కొబ్బరి బోండాలను కర్నూలు నగరంలోని పలు అంగళ్లకు విక్రయించేవాడు. పది ఎకరాల భూములు కౌలుకు తీసుకొని వివిధ రకాల పంటలు సాగుచేసేవాడు. సుమారు రూ.15 లక్షల అప్పు చేశాడు. అయితే మూడేళ్ల నుంచి కొబ్బరి బోండాల వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. పంట దిగుబడులు రాక, గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేనేమోనని మనస్తాపానికి గురైన నూర్‌బాషా మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య ఖాజాబన్ని, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్‌కుమార్ తెలిపారు.

## కుడా చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు



సోమిశెట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నాయకులు

**కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలి శారు. బుధవారం పార్టీ కార్యాలయంలో 12వ వార్డు ఇన్‌చార్జి బి.చిన్నమ్మ, వడ్డెగేరి పాండు, అభిలాష్, నాగార్జున కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

## టీడీపీ సభ్యత్వం తీసుకోవాలి



బూడిదపాడులో టీడీపీ సభ్యత్వాన్ని చేయిస్తున్న నాయకులు

**గూడూరు నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** టీడీపీ కార్యకర్తలంతా సభ్యత్వాన్ని తీసుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని బూడిదపాడు గ్రామంలో జె సురేష్ అధ్యక్షతన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసంద ర్భంగా సురేష్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్త లందరికీ ప్రమాద బీమా కింద రూ. 5లక్షలు ఇస్తుందన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు బంగారు శ్రీనివాసులు, రాముడు రామాంజి, లక్ష్మన్న, బాస్కర్, ఏసన్న, ఈరన్న, యుగంధర్ పాల్గొన్నారు.

## 'అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి'

**కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** సి.క్యాంపులో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో ఇన్‌చార్జి మేనేజర్ స్వర్ణలతకు వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కల్పించే విధంగా బస్‌స్టాప్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు ఆక్రమణకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, చంటి, కుమార్ పాల్గొన్నారు.

## 'నాసిరకం విత్తనాలతో నష్టపోయాం'

**గూడూరు నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** నాసిరకం విత్తనాలతో పంట నష్టపోయాం, తమను ఆదుకోవాలని కె నాగలాపురం గ్రామానికి చెందిన రైతు గోపాల్ రెడ్డి కోరారు. బుధవారం గూడూరు మండలం లోని కె నాగలాపురం గ్రామానికి చెందిన రైతు గోపాల్ రెడ్డి నాసిరకం విత్తనాల వల్ల దిగుబడి లేని కంది పంటను చూపించారు. ఈ సంద ర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఐదు ఎకరాల్లో కంది పంటను సాగు చేస్తానని, అయితే నాసిరం విత్తనం కావడంతో పంట పెరిగిందే కాని కాపు రాలేద న్నారు. క్వింటం కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ నాసిరం విత్తనాలతో మండలం లోని కె నాగలాపురంతోపాటు బూడిదపాడు, పెంచికలపాడు గ్రామాల్లోని రైతులు కూడా పంట దిగుబడి రాక నష్టపోయారన్నారు. అధికారులు స్పందించి నాసిరం విత్తనాలను అమ్మి న దుకాణాలదారులను, కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉపాధి పనుల లక్ష్యం చేరుకోవాలి

**కల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** ఉపాధి హామీ పనులను లక్ష్యం చేరుకోవాలని ఎంపీడీవో జీఎన్ఎస్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎల్ఆర్సీ కోర్స్ డైరెక్టర్ ఎర్రమల హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని గ్రా మాల్లో ప్రజలు, పంచాయతీ భాగస్వా మ్యంతో గుర్తించిన పనులను పూర్తి చేయాలని, లేబర్ టార్గెట్ పర్సెంటేజీ, వంద రోజుల ఆర్టికల్చర్ పనులు లక్ష్యం చేరుకోవాలన్నారు. అలాగే పర్ల, కె.మా ర్కాపురం గ్రామాల్లో ఏపీఓ మద్దీశ్వ రమ్మ ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు.



## ఉపాధి పనులను ఉపయోగించుకోండి

**సి.బెళగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఉపాధి పనులను ఉపయోగించుకోవాలని ఎంపీడీవో రాణె మ్మ అన్నారు. బుధవారం ఆమె మాట్లా డుతూ జాబ్‌కార్డు ఉన్న వారంతా ఉపాధి పనులను ఉపయోగించుకోవాల న్నారు. అలాగే 5 ఎకరాలలోపు ఉన్న రైతులు పండ్లతోటలను సాగు చేసుకో వాలన్నారు.

# సూచికల లక్ష్యాలను సాధించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

**కర్నూలు కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** హొళగుంద, మద్దికెర, చిప్పగిరి మండలాల్లో నిర్దేశించిన 40 సూచికలకు సంబంధించిన లక్ష్యాలను డిసెంబరులోపు సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో యాస్పిరేషనల్ బ్లాక్స్ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐసీడీఎస్‌కు సంబంధించి తీవ్రమైన పోషకాహార లోపం, మితమైన పోషకాహార లోపం ఉన్న ఐదేళ్లలోపు పిల్లలకు ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు , ఆయాలు పిల్లల ఇంటికి వెళ్లి ఎలాంటి న్యూట్రీషన్ ఆహారం ఇచ్చారు.. బాలామృతం ఇచ్చారు.. తదితర వివరాలను యాప్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న టాయిలెట్లు, ట్యాప్ కనెక్షన్‌లను డిసెంబరులోపు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి జల్‌జీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న ఇంటింటికి కొళాయి కనెక్షన్లను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిది ద్దాలన్నారు. ఫైబర్ నెట్‌కు సంబంధించి ఈ మూడు మండలాల్లో వంద శాతం ఫైబర్ నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీవో హిమ ప్రభాకర్ రాజు, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, హౌసింగ్ పీడీ చిరంజీవి, యాస్పిరేషనల్ బ్లాక్స్ మండలాల అధికారులు పాల్గొన్నారు.

**పంటలకు బీమా చేయాలి:** రబీలో జొన్న, వేరుశనగ, టమోటా, శనగ, ఉల్లి పంటలకు బీమా ఆఖరు తేదీ డిసెంబరు 15 అని, వరి పంటకు ఆఖరు తేదీ డిసెంబరు 31 అని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకో వాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో పంటల బీమాకు సంబంధించి స్వచ్ఛంద నమోదు కార్యాచరణ ప్రణాళిక అమలుపై కలెక్టర్ జిల్లా స్థాయి మాని టరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రతి ఎకరాకు ప్రీమియం రూపంలో శనగ రూ.420, జొన్న రూ.297, వేరుశనగ రూ.480, ఉల్లిగడ్డ రూ.1350, టమోటా రూ.1500 ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేసుకోవడానికి ఆఖరి తేదీ డిసెంబరు 15 అని తెలిపారు. వరి పంటకు రైతులు ప్రతి ఎకరాకు రూ.630 ప్రీమియంగా చెల్లించి డిసెంబరు 31లోపు బీమా చేయించు కోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

# కోడుమూరులో చైన్ స్నాచింగ్‌కు యత్నం

- పోలీసులకు దొరికిన గొలుసు
- దొంగల కోసం గాలింపు



బాధితురాలిని విచారిస్తున్న ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు

**కోడుమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** కోడుమూరులో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మహిళ ఉపాధ్యాయురాలి మెడలోని గొలుసును లాగేసుకున్నారు. అయితే తప్పించుకుని వెళ్లే ప్రయత్నంలో బంగారు గొలుసును అక్కడే పడేసి బైక్‌పై వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు తెలిపిన వివరాలు మేరకు కోడుమూరులో నివా సం ఉంటున్న అనసూయ అనే మహిళ ఉపాధ్యాయురాలు గణేష్ నగర్ ప్రాంతంలో మైదానంలో సాయంత్రం వాకింగ్ చేస్తుండగా టీవీఎస్ స్పోర్ట్స్ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ముఖానికి ముసుగు వేసుకొని మైదానానికి చేరుకున్నారు. పథకం ప్రకారం ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కున్నారు. బాధితురాలు వెంటనే కేకలు వేయడంతో ఆ ప్రాంతంలో వాకింగ్ చేస్తున్న కొంత మంది దొంగలను వెంబడించే ప్రయత్నం చేశారు. దీంతో దొంగలు లాక్కున్న గొలుసును చెట్లల్లో పడేసి వెళ్లిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ తన సిబ్బందితో గొలుసు కోసం వెతకగా చెట్ల పొదల్లో దొరికింది. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితురాలు చెప్పిన వివరాల మేరకు నిందితులను గుర్తించి త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## గుడిసెలు కూల్చిన చోటే పట్టాలివ్వాలి



రూరల్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**కర్నూలు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** కర్నూలు రూరల్ మండలం పసుపుల గ్రామంలో పేదల గుడిసెలు కూల్చిన చోటే పక్కా ఇల్లు నిర్మించి పట్టాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి పీబీ ఉశేనయ్యతో కలిసి బుధవారం నాయ కులు రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబుకు వినతి పత్రం సమ ర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గ్రామంలో 70/5 అను సర్వే నెంబరులో 22 ఎకరాల ప్రభుత్వానికి చెందిన చుక్కల భూమి ఉందని, దానిని గ్రామానికి చెందిన మాజీ వీఆర్వో రామేశ్వర రావు తన పేరుపై ఎక్కించుకొని, అందులో 15 ఎకరాలను కర్నూలుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మేశారని వివరించారు. మిగిలిన 5 ఎకరాల్లో పేదలు గుడిసెలు వేసుకోగా నగరానికి చెందిన కొంతమంది రాజకీయ నాయకులు తమ పలుకుబడి ఉపయోగించి వైసీపీ హయాం లో ఆ గుడిసెలన్నీ నేలమట్టం చేశారని ఆరోపించారు. తక్షణమే వాటిపై విచారణ జరిపి అప్పటి ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని ఆయన తహసీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, భాస్కర్, సుందర్‌రాజు పాల్గొన్నారు

## హామీలను అమలు చేయాలి

**కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** టీడీపీ కూటమి ప్రభుత్వం రజకులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్క రయ్య డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజక వృత్తిదారు లకు సామా జిక రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. రజక కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. జిల్లా కార్యదర్శి సి.గురు శేఖర్, ముక్కన్న, సి.జయమ్మ, శ్రీనివాసులు, సి.శేషాద్రి పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

**కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** కర్నూలు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమి తులైన సుభాష్ చంద్రబోసు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన్ను కలిసి పూలబొకేను అందజేశారు.



## టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

**కర్నూలు హాస్పిటల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీని వాసులు అన్నారు. నగరంలోని ముజఫర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 82వ సచివా లయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాలపై గర్భిణులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, సచివాలయ ఏఎన్ఎం స్వర్ణలత, ప్రొజెక్షనిస్టు ఖలీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు అవసరం

**కర్నూలు అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** చదువు తోపాటు సాంస్కృతిక కార్యక్రమా లు అవసరమని క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయి గోపాల్ అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ కళాశాల ఆడి టోరి యంలో యువతరంగ్ పేరుతో అంతర్ కళాశాలల విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు.

## మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

**కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** నగరంలోని మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. బుధవారం జోహరాపురం, జమ్మిచెట్టు, రేణు కానగర్, రిచ్‌మండ్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ తదితర ప్రాంతాలలో కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా కాలనీల్లో స్థాని కుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజీలు అనుసంధానం లేక మురుగునీరు బయటక వెళ్లేందుకు ఆస్కారం లేని చోట్ల అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందిం చాలన్నారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గిరిరాజు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, ఏఈ ప్రవీణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

## ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న చంద్ర శ్రీనివాసరెడ్డి

**కర్నూలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** నగరంలోని సిండికేట్ రిటైర్డ్ ఎంప్లాయీస్, మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీల ఆధ్వర్యంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం నగరంలోని డీవీఆర్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 'మహిళ, యువత, బలహీన వర్గాల అభివృద్ధి సాధనలో సహకార రంగం పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సిండికేట్ మ్యాక్ సొసైటీ చైర్మన్ చంద్ర శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ఎన్ రామాంజనేయులు, డీసీసీఓ షేక్ జఫ్రీన్, శ్రీరామ్ రాఘవేంద్ర ఎం ఏసీసీ సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

# ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

**ఓర్వకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** గత వారం రోజుల నుంచి మండలంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లో గ్రంథాలయ శాఖాధికారులు హనుమేనాయక్, కౌసల్య ఆధ్వర్యంలో ముగింపు వేడుక లను నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గూడూరు:** గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. బుధవారం గ్రంథాలయాధికారి బి మధు నాయుడు ఆధ్వర్యంలో గూడూరులోని జడ్పీ (బాలురు) పాఠశాలలో 57వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమ తులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

**కర్నూలు కల్చరల్:** కల్లూరులోని శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న 57వ జాతయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. కల్లూరులోని కేశవరెడ్డి పాఠశాల్లో ఏర్పా టు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వం, పుస్తక పఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయ అధికారి సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామాపురం సమస్యలకు మోక్షం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**కోడుమూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని లద్దగిరి మజరా రామాపురం కొత్తకాలనీ సమస్యలకు మోక్షం లభించింది. కాలనీలో సరియైన దారులు లేక పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోవడంతో పాములు, విషకీటకాల సంచారం అధికమయ్యాయి. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బం దులను ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో "అభివృద్ధికి ఆమడ దూరం" శీర్షికన కథనం వెలు వడింది. దీంతో అధికారులు స్పందించారు. సర్పంచ్ పట్టి హనుమంతు బుధవారం పనులు చేపట్టి పర్యవేక్షించారు. ఎక్స్‌కవేటర్‌తో ఇళ్ల మధ్య, పాఠశాల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. దారులను ఎర్రమట్టితో నింపి చదును చేశారు.

## గ్యాస్‌పైనే వంటలు చేయాలి: డీఈవో

**కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో గ్యాస్‌పైనే వంటలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ అన్నారు. చాలా చోట్ల కట్టెల పొయ్యిపై వండుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రధా నోపాధ్యాయులు, మండల విద్యాధికారులు తనిఖీలు చేసి ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య వివరాల నమో దులో ఆరోగ్య సమస్యలన్నింటినీ కార్డులో పొందుపరచాలన్నారు. డ్రాపౌట్లు లేకుండా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తక్షణం చర్యలు చేపట్టాలని డీఈవో శ్యామ్యూల్ పాల్ ఆదేశించారు.

## 'ఉద్యోగ భద్రత కల్పించాలి'

**కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** వెలుగు సంస్థలో పని చేస్తున్న వీవోఏ (వెలుగు యానిమేటర్స్)లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. వీవోఏల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద వారు ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షుడు గుంటప్ప అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు మాట్లాడుతూ వీవోఏలకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజకీయ ఒత్తిడిలు పెరిగిపో యాయన్నారు. కార్యక్రమంలో సుంకన్న, వెంకటస్వామి, జయమ్మ, మద్దిలేటి, రమణయ్య పాల్గొన్నారు.

## బేస్‌బాల్‌లో సత్తా చాటాలి

**కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో బుధవారంజరిగిన అండర్-19 బేస్‌బాల్ ఎంపిక పోటీలు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగా యి. ముఖ్యఅతిథిగా హాజరై ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరమే శ్వరరెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు.

## పాఠశాలల సమయం పెంచడం సరికాదు

**కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల సమయాన్ని పైలట్ ప్రాజెక్టు పేరుపై సాయంత్రం 5గంటల వరకు పెంచడం సమంజసం కాదని ఉపా ధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతి రావు, కే.ప్రకాష్‌రావు బుధవారం అన్నారు. దీని వల్ల విద్యార్థులకు లాభం కన్నా నష్టం ఎక్కువగా జరుగుతుందని తెలిపారు.

## వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీపై విచారణ

**కర్నూలు న్యూసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలోని 92వ వార్డు గురురాఘవేంద్ర సచివాలయంలో పని చేస్తున్న వార్డు అడిన్మిస్ట్రేటివ్ సెక్రటరీ టి.శివప్రసాద్‌పై విచారణ చేపట్టా లని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సెక్రటరీ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. జియో ట్యాగింగ్, పెన్షన్, స్కిల్ సర్వే పనులు చేయకుండా జాబ్ చార్ట్ మెయింటేన్ చేయడం లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉన్నతాధికారులు అడిగిన సమాచారం ఇవ్వడంలేదన్నారు. సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండకుంట బయటే తిరుగుతున్నారని కమిషనర్ పేర్కొ న్నారు. 36వ వార్డు ప్రత్యేక అధికారి ఇప్పటికే శివప్రసాద్‌పై రిపోర్టు తయారు చేసి అందించినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో రెవెన్యూ ఆఫీసర్ కేఎం.జునైద్‌ను విచారణ అధికారిగా నియమించారు. మూడు రోజుల్లో విచారణ చేపట్టి నివేదికలు సమర్పించాలని కమిషనర్ పేర్కొన్నారు.

## బొడ్డువానిపల్లెలో కార్తీక వనభోజనం

**కల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లు మండలం బొడ్డువానిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 24న కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు పుసులూరు ప్రభాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బొడ్డువానిపల్లె సమీప గ్రామాల ప్రజలు, పెద్దల ఆర్థిక సహకారంతో కార్తీక వనభోజనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓర్వకల్లు, కల్లూరు, వెల్దుర్తి, కర్నూలు మండలాల నుంచి పెద్దఎత్తున ప్రజలు హాజరై వనభోజనాన్ని విజయవంతం చేయాలని కోరారు. 24న గౌరవ అతిథులతో ప్రత్యేక పూజలు, గోపూజ, నందికోలా సేవా, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలు, మహిళలకు ఆటల పోటీల తోపాటు సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## 24న గోర్ బంజారా కార్తీక వనభోజనం

**కర్నూలు అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** గోర్ బంజారా సంస్కృతి కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24న కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకుడు నంద్యాల రాజ్ లక్ష్మీనారాయణ తెలిపారు. నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం పక్కన ఉన్న శ్రీనివాస గార్డెన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా బంజారాలు భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ రాములు నాయక్, రాథోడ్ జయరాం, రామచంద్ర నాయక్, రాజా నాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థి బస్సును సకాలంలో నడపండి

**కర్నూలు రూరల్/గూడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** విద్యార్థి బస్సును సకాలంలో నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్య దర్శి రంగప్ప, అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూలు-2 డిపోలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజరు దీప్తికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గూడూరు మండలంలో దాదాపు 200 మంది విద్యార్థులు గూడూరు నుంచి జూలకల్లు మోడల్ స్కూల్‌కు వెళ్తుంటారని వివరించారు. అలాగే జూనియర్ కాలేజీ దగ్గర రిక్వెస్ట్ బ స్టాప్ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు ఖాజా, విద్యార్థులు ఉన్నారు.

## అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

**సి.బెళగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్, పోలకల్లు, క్రిష్ణదొడ్డి, సంగాల గ్రామాలలో ఆయన పర్యటించారు.

## వైభవంగా గోరంట్ల గురువు ఆరాధన

**ఓర్వకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మండలంలోని పూడిచెర్ల గ్రామంలోని గురు పాదుక ఆశ్రమంలో సద్గురు కాటమ గోరంట్ల గురువు వారి 16వ ఆరాధనోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవా నికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గురువుల వారి సమాధిని దర్శించుకున్నారు.

# సంక్షేమం కాదు!

- శిథిలావస్థలో ఎస్సీ కళాశాల వసతి గృహం
- పెచ్చులూడుతున్న పైకప్పు
- మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థ



శిథిలావస్థలో హాస్టల్ భవనం, ఇన్‌సెట్‌లో ఆరుబయట స్నానపు కొళాయిలు

**శిథిలావస్థలో భవనం, పెచ్చులూడుతున్న పైకప్పు, పొలాల్లో కాలకృత్యాలు, రాత్రిళ్లు పాములు, తేళ్లు.. ఇవీ ఆదోని ఎస్సీ కళాశాల హాస్టల్ దుస్థితి. విద్యార్థులు నిత్యం భయం భయంతోనే కాలం గడుపుతున్నారు. ప్రమాదం జరగకముందే హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చాలని కోరుతున్నారు.**

**ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పట్టణ శివారులోనే టీజీఎల్ కాలనీ వెనుక ఉన్న ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. రెండెకరాలకు పైగా స్థలంలో ఈ భవనాన్ని 196-87లో నిర్మించారు. 6 గదులు ఉండగా, ఈ హాస్టల్‌లోనే ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు 136 మందికి పైగా వసతి పొందుతూ చదువుకుం టున్నారు.

### పొలాల్లోకి వెళ్లాల్సిందే

హాస్టల్ మరుగు దొడ్లు లేవు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోంది. రాత్రిళ్లు ఎంతో ఇబ్బందిపడుతున్నారు. హాస్టల్ చుట్టూ ముళ్లపొదలు, పొలాలు ఉన్నాయి. పట్టణ మురుగు నీరు అంతా హాస్టల్ పక్కన నుంచే వెళుతుంది. రాత్రిళ్లు పాములు, తేళ్లు వస్తున్నాయి. స్నానపు గదులు లేక ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు.

### పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉండడంపై కొన్నేళ్లుగా విద్యార్థి సంఘం నాయకులు ఆందోళనలు చేస్తున్నా అధికారులు, ప్రజా ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదు. హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చాలని సాంఘిక సంక్షేమ అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ భవనాన్ని చూసిన విద్యార్థులు ఇందులో ఉండేందుకు అనాసక్తి చూపుతున్నారు. ఇక్కడ చేరినవారు కూడా మధ్యలో హాస్టల్ నుంచి వెళ్లిపోతున్నారు.

### శిథిలావస్థకు చేరిన భవనం

హాస్టల్ భవనం ఏళ్ల నాటిది కావడం, అధికారులు నిర్వహణను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. చూసేవారికి ఇదో పాడుబడ్డ భవనంగా కనిపిస్తుంది. పైకప్పులు పెచ్చులూడుతుండటంతో విద్యార్థులు భయం భయంగా కాలం గడుపుతున్నారు. వర్షం వచ్చిందంటే పైకప్పు నుంచి వర్షపునీరు వస్తోంది. ఏ క్షణం ఏమి జరుగుతుందోనని నిద్రలేని రాత్రులు గలపుడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మరో భవంలోకి మార్చాలి

హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉంది మరో భవనంలోకి మార్చాలని కొన్నేళ్లుగా ధర్నా చేస్తున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే అధికారులే బాధ్యత వహించాలి. మరో భవనంలోకి తరలించాలి లేకతే నూతన భవనాన్ని నిర్మించాలి. **- శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదోని**

### వారంలో మరో భవనంలోకి

హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. పట్టణంలోని ఎస్సీ నెంబర్ 2వ భవనంలోకి వారం లోపు మారుస్తాం. **- బాబు, ఏఎస్‌డబ్ల్యూవో, ఆదోని**

### ఎస్టీ హాస్టల్-2లోకి మార్చాలి

హాస్టల్‌ను పట్టణంలో ఖాళీగా ఉన్న ఎస్సీ హాస్టల్ నెంబర్ 2లోకి లేదా అద్దె భవనంలోకి మార్చాలని విద్యార్థులు కోరుతున్నారు. అలా మారిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు భవనాన్ని మార్చి, నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## రాయలసీమ ప్రాజెక్టుల పట్ల పాలకుల నిర్లక్ష్యం

**ఆలూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయి. కాంగ్రెస్ ఇన్‌చార్జి లక్ష్మి నారాయణ అన్నారు. వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని బుధవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. గౌస్ దేశాయి. మాట్లాడుతూ, 2019లో సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన వేదవతి ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం రీటెండరింగ్ పేరుతో నిలిచివేసిందన్నారు. బడ్జెట్‌లో రూ.500కోట్లు కేటాయించి, రైతులకు ఎకరాకు రూ.20లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని కోరారు. రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ సీపీఐ నాయకులు భూపేశ్, బీఎస్పీ ఇన్‌చార్జి రామలింగ, రాధాకృష్ణ, పూల రామంజి నేయులు, రామాంజినేయులు, గోవర్ధన్, గౌసియా పాల్గొన్నారు.

## 24న రైతు సంఘం వన భోజనం

**పత్తికొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 24న పత్తికొండ మండలం మండిగిరి రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏపీ కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం కార్యదర్శి సురేంద్ర కుమార్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా వ్యవసాయ రంగ నిపుణులు ఎం.సీవీ ప్రసాద్, విశ్రాంత ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య పాల్గొంటారన్నారు. రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు.

## రేషన్ డీలర్లు డీడీలు చెల్లించాలి

**మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రేషన్ డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు చక్కెర, కందిబేడలు, బియ్యం సరఫరాకు డీడీలు ఇవ్వాలని, చెల్లించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్ ఉన్నారు.

## బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలి




మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

**పత్తికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** బీసీలు ఐక్యంగా ముందుకుసాగాలని 23న కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభకు తరలి రావాలని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పిలుపునిచ్చారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడుతో కలసి మాట్లాడారు. కప్పట్రాళ్ల సురేంద్రనాయుడు, వెంకటరాముడు, శ్రీనివాసులుగౌడ్, సంగాలక్రిష్ణ తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయాలతో విజ్ఞానం



బహుమతులు అందిస్తున్న విశ్రాంత డీఎస్పీ రంగముని

**ఆలూరు, నవంబరు 20 (ఆధ్రజ్యోతి):** గ్రంథాలయాలతో విజ్ఞానం వస్తుందని విశ్రాంత డీఎస్పీ రంగముని అన్నారు.. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. విశ్రాంత డీపీవో శ్రీనివాసులు, గ్రంథాలయ మాజీ చైర్మన్ రామూర్తి, గ్రంథాలయ అధికారి విజయభాస్కర్, విశ్రాంత హెచ్ఎం వీరాస్వామి, విశ్రాంత ఉపాధ్యాయులు ఈరన్న, దేవదానం, రమేష్ విజయకుమార్ పాల్గొన్నారు.

## పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత



దాత అందించిన జంపింగ్ స్లైడర్

**ఆదోని టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** కెనరా బ్యాంక్ ఏజీయం సాకరే ఈరన్న స్థానిక జీహ్వేశ్వర ఎయిడెడ్ పాఠశాలకు బుధవారం రూ.1.90లక్షల ఖరీదు చేసే జంపింగ్ స్లైడర్‌ను బహుకరించారు. గతంలో ఈ పాఠశాల మొదటి బ్యాచ్‌లో తాను చదివానని, చదువుకున్న పాఠశాలను, ఉపాధ్యాయులను మరువ రాదన్నారు. దాతను యాజమాన్యం వారు సన్మానించారు. సెక్రటరీ సాకరే ఈరన్న, హెచ్ఎం సంగీత, కెనరా బ్యాంక్ బీఎంఏకేరథ్, పెద్దలు సాకరే మారుతి రావు, రసాలే గోవింద రావు, మల్లికార్జున, సాకరే వసంత, యస్‌కే రాజశ్వరి, విద్యావతి, రామకృష్ణ పాల్గొన్నారు.

## అదనపు బోగీల ఏర్పాటు అభినందనీయం

**ఆదోని టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** నెలాఖరులోగా రైళ్లల్లో వెయ్యి జనరల్ బోగిలను అదనంగా ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ ఆస్పత్రుల సలహా మండలి మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ, జనరల్ బోగీలు రద్దీకి సరిపోక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, అదనపు భోగీలతో ఊరట కలుగుతుందన్నారు.

## క్యాన్సర్ నుంచి బయటపడవచ్చు



క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నుంచి బయటపడ వచ్చని వైద్యాధికారి రాగిణి, సీహెచ్‌వో నిరంజన్‌బాబు అన్నారు. బుధవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వే చేస్తున్నామని, ప్రజలు వైద్యసిబ్బందికి సహకరించాలని కోరారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు ప్రసవానికి వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రాంపల్లిలో పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**తుగ్గలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఉపాధి నిధులతో సీసీ రోడ్ల పనులు ప్రారంబించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు బుధవారం తెలిపారు. రాంపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, మురికి కాలువల ఏర్పాటును ఎక్స్‌వేటర్‌తో చెత్త తొలగించి గరుసు తోలి చదును చేస్తున్నామన్నారు. రాంపల్లి శ్రీను, విద్యాకమిటీ చైర్మన్ చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

## రహదారి సమస్య పరిష్కారం

**పత్తికొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని దూదేకొండ గ్రామం నుంచి చక్రాళ్ల గ్రామానికి ఉన్న రహదారి సమస్య పరిష్కారమైంది. ఈ రహదారికి గ్రామానికి చెందిన ఓ రైతు అడ్డుపడటంతో సమస్యను గ్రామస్థులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీవో భరత్ నాయక్‌తో చర్చించి పూర్వం మాదిరిగానే రాకపోకలు సాగించేలా రైతు అంగీకరించడంతో సమస్య పరిష్కారమైంది. ప్రజలు ఆర్డీవోకు కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీ సభ్యత్వ నమోదులో తుగ్గలి టాప్



మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర, బత్తిన

**తుగ్గలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఈ ఏడాది టీడీపీ సభ్యత్వ నమోదులో తుగ్గలి మండలం టాప్‌లో నిలిచిందని, ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. బుధవారం తుగ్గలిలో నాగేంద్ర స్వగృహంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి ప్రజలు స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. బలహీన వర్గాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శ్యాంబాబు కృషి చేస్తున్నారన్నారు. తిమ్మయ్య చౌదరి, వెంకటస్వామి, కొమ్మె వెంకటేశ్, లక్ష్మినారాయణ చౌదరి, సర్పంచులు రవి, రామాంజనేయులు, వాహిద్ బాషా ఉన్నారు.

## కారు బోల్తా ..

- దంపతులకు గాయాలు



గడ్డిపొదల్లో బోల్తా పడిన కారు

**వెల్దుర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన వెల్దుర్తిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరికృష్ణ, భార్య నీలు యాదవ్ గాయపడ్డారు. దంపతులు కూతురితో కలిసి హైదరాబాదు నుంచి బెంగుళూరుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామం దాటాక హరికృష్ణ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపుతప్పింది. కారు రోడ్డు దిగి వంద మీటర్ల దూరం వరకు వెళ్లి చెట్టును ఢీ కొట్టి పచ్చిగడ్డి పొదల్లో బోల్తాపడింది. అటుగా వెళుతున్న బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. గ్రామస్థుల సహాయంతో కారు అద్దాలు పగులగొట్టి దంపతులను, చిన్నారిని బయటకు తీశారు. దంపతులకు గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు.

## హమాలీల కూలి రేట్లు పెంచాలి



చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

**ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పెరిగిన నిత్యవసరాల ధరలకు అనుగుణంగా హమాలీ కూలి రేట్లు పెంచాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కోరారు. బుధవారం మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి సమక్షంలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్, రైతు సంఘం ప్రతినిధులతో చర్చించారు. రెండేళ్లకోసారి కూలీరేట్లు పెంచాల్సి ఉండగా గడుపు ముగిసి ఏడాదైనా పెంచలేద న్నారు. నోటీసు గడువు ముగియడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు హమాలీలు తెలపడంతో అధికారులు చర్చలు జరిపారు. కూలీలను 25% పెంచాలని హమాలీలు డిమాండ్ చేశారు. రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి 20శాతం పెంచేందుకు అంగీకరించారు. కూలీ రేట్ల పెంపుదలపై రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్‌కు నివేదిక పంపుతామని కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ఉపాధ్యక్షుడు రాజా గౌడ్ పత్తి వ్యాపారుల సంఘం కార్యదర్శి వెంకట్రామ్ రెడ్డి, తిమ్మప్ప, కాశీ, గోపాల్, వెంకప్ప పాల్గొన్నారు.

## పని వేళల పెంపు సరికాదు

**ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల పని వేళలను పెంచడం తగదని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం ఎస్టీయూ కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే యాప్‌ల భారంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బకాయిలను విడుదల చేయాలని, 12వ పీఆర్సీని నియమించి, 30శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. సుంకన్న, రామాంజినేయులు, శిక్షావలి, రామకృష్ణ, ఆంజనేయులు, సుధాకర్ బాబు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు డిపో వద్ద ఆందోళన చేశారు. డిపో గౌరవ అధ్యక్షుడు అజీమ్ ఖాన్ మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు అలవెన్స్, ఇన్సెంటివ్, టీఏ బిల్లులు చెల్లించాలని, చిన్న చిన్న విషయాలకు కేసు రాయడం మంచిది కాదన్నారు. 12వ పీఆర్సీ అమలు చేసి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రసాద్, రవి, ఎమ్మెస్ ప్రసాద్ పాల్గొన్నారు.

# న్యాయ సంస్థలను తరలించొద్దు

- ఆదోనిలో న్యాయవాదుల ర్యాలీ, పత్తికొండలో రాస్తారోకో




ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

**ఆదోని రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** కర్నూలునుంచి న్యాయ సంస్థలను తరలించి రాయలసీమకు అన్యాయం చేయొద్దంటూ న్యాయవాదులు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్‌సింగ్, ఉపాధ్యక్షుడు మొలగవల్లి జనార్ధన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. కూటమి నాయకులు మౌనం వీడి కర్నూలు నుంచి న్యాయ సంస్థలను తరలించకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. రవికృష్ణ, వై.ఆర్.మల్లికార్జున, బషీర్ అహ్మద్, లోకేష్, జీవన్, శివప్రసాద్, బంగారయ్య, రామాంజనేయులు, నాగేంద్రయ్య, ఆనంద్, రజినీకాంత్ పాల్గొన్నారు.

### విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**పత్తికొండ టౌన్:** కర్నూలులో ఉన్న లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను అమరావతికి తరలించవద్దంటూ పత్తికొండ న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి ఆధ్వర్యంలో న్యాయవా దులు నాలుగు స్థంభాల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ ప్రాంతమైన కర్నూ లులో న్యాయసంస్థల కార్యాలయాలను ఏర్పాటు చేశారని, కూటమి ప్రభుత్వం వీటిని అమరావతికి తరలించాలని చూస్తే ఉద్యమాన్ని ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదులు హుల్తన్న, నాగభూషణం రెడ్డి, అశోక్ కుమార్, రాజశేకర్ నాయుడు, మహేష్, ఎల్లారెడ్డి, సత్యనారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా దిలీప్ కుమార్



**ఆలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ఆలూరు ఎస్ఐగా జి.దిలీప్ కుమార్‌ను నియమిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వెంకట నరసింహులుపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో ఆయనను వీఆర్‌కు పంపారు. సత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న దిలీప్ కుమార్‌ను ఆలూరుకు నియమించారు. ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసి శాంతి భద్రతలను గాడిలో పెడతామన్నారు. ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామని, సహకరించాలన్నారు.

## బీమా నమోదు చేసుకోండి

**హాలహర్వి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రబీలో శనగ, జొన్న, వరి పంటలకు బీమా నమోదు చేసుకోవాలని ఏవో శివశంకర్ సూచించారు. బుధవారం బాపురం, నిట్రవట్టి గ్రామంలో పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలని కోరారు.

## గ్రంథాలయాలను వినియోగించుకోండి

**ఆస్పరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కేడీసీసీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జెడ్పీటీసీ దొరబాబు, లైబ్రేరియన్ విశ్వనాథ రెడ్డి కోరారు. బుధవారం గ్రంథాలయాల వారోత్సవ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. సతీష్ కుమార్, రామాంజినేయులు, నరేష్ ఆచారి పాల్గొన్నారు.

## చెత్తసంపద తయారీ షెడ్ల పరిశీలన

**వెల్దుర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మండలంలోని అల్లుగుండు గ్రామంలో చెత్త సంపద తయరీ కేంద్రాలను డీఎల్‌పీవో లక్ష్మి మంగళవారం పరిశీలించారు. వర్మీకం పోస్టు తయారీకి వానపాములను వదిలారు. చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉండరాదని ఎరువులు తయారుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈవోఆర్డీ రవికిషోర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**క్రిష్ణగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పేదలందరికీ ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల సహయ కార్యదర్శి, సర్పంచ్ రవి మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం బోయ బొంతిరాళ్ళ పంచాయతీ కార్యదర్శి సలీంద్ర సుంకన్నకు వినతిపత్రం ఇచ్చారు. హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాన్నారు. పేదలను గుర్తించి 3 సెంట్ల స్థలం, రూ.5లక్షలతో ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్నారు. కటారుకొండ పుల్లయ్య మాదవ్, కృష్ణ, సుంకన్న, చంద్ర, ఆచారి, ఖాసీం, లక్ష్మన్న, రామాంజనేయులు, మాద న్న, సుధాకర్, బజారి, రామాంజిని ఉన్నారు.

## ఆలయానికి సీసీ రహదారి

**పత్తికొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** కొండగేరి నుంచి మారెమ్మ ఆలయం వరకు రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న రహదారి నిర్మాణానికి బుధవారం టీడీపీ జిల్లాఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి భూమిపూజచేశారు. కురువ సంఘం తాలూకా అధ్యక్షుడు బ్రహ్మయ్య టీడీపీ నాయకులు ఎరుకలచెరువు సురేంద్ర, తిక్కరమేష్, చిన్నా, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆక్రమిస్తే చర్యలు

**మద్దికెర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ హెచ్చరించారు. బుధవారం అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కాలువలపై నిర్మాణాలను వెంటనే తొలగించాలని, లేకపోతే కూల్చివేస్తామన్నారు. డీపీవోకు నివేదిక పంపిస్తామన్నారు. వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

## మట్కారాయుళ్ల అరెస్టు

**ఆదోని రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :** పెద్దతుంబళం గ్రామంలో మట్కా ఆడుతున్న ఒ వ్యక్తి, మహిళను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2వేలు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.


## గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

**ఆదోని అగ్రికల్చర్, నవంబరు 20 (ఆధ్రజ్యోతి):** గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సుజాత ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుక నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు సీఐ వెంకటచలపతి



**ఆలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :** రోడ్డు ప్రమాదాలు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ఆలూరు సీఐ వెంకటచలపతి అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతి కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ప్రశ్న:** రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**జవాబు:** ఎస్పీ ఆదేశాల మేరకు వాహనదారులకు కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం, హెల్మెట్ వాడాలని సూచిస్తున్నాము.

**ప్రశ్న:** పేకాట, సారా నియంత్రణ చర్యలేమిటి?

**జవాబు:** ఆలూరు సర్కిల్ పరిధిలోని 4 మండలాల్లో పేకాట, అక్రమ మద్యం, సారా తయారీపై నిఘా ఉంచాం. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

**ప్రశ్న:** ఆలూరులో ట్రాఫిక్ నియంత్రణకు ఏ చర్యలు తీసుకున్నారు.?

**జవాబు:** రద్దీగా ఉండే అరికెర రోడ్డు, అంబేద్కర్ కూడళ్లలో ఇద్దరు కానిస్టేబు ళ్లను నియమించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..

**ప్రశ్న:** పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే ఆటో డ్రైవర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నాము.

**ప్రశ్న:** సమస్యాత్మక గ్రామాల పట్ల మీ చర్యలేమిటి?

**జవాబు:** సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉంచాం. అలాగే పల్లెనిద్రలో కౌన్సెలింగ్ నిర్వహించి, ప్రశాంత వాతావరం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాం.

# మిరపకు తెగులు

• కాయదశలో ఎండుతున్న మొక్కలు
• ఆందోళనలో రైతులు

**గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మిరప పంటకు బూడిదతెగులు, వేరుకుళ్ల తెగులు సోకడంతో మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, పెద్దకడుబూరు, మండలాల్లో బావులు బోర్ల కింద రైతులు మిరప పంట సాగుచేశారు. మండలాల్లో దాదాపు 15వేల ఎకరాల్లో మిరపను సాగుచేశారు. అయితే సాగు చేసిన పంటకు బూడిద, వేరుకుళ్ల తెగులు సోకడంతో పంటకు పట్టిన పూత, కాయ రాలిపోతుంది. కాయపట్టే సమయంలో ఈ తెగుళ్ల సోకడంతో పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గోనెగండ్ల మండలంలో మూడు వేల ఎకరాలు, ఎమ్మిగనూరు మండలంలో మూడు వేల ఎకరాలు, పెద్దకడుబూరులో రెండువేల ఎకరాలు, నందవరం నాలుగు వేల ఎకరాల్లో మంత్రాలయంలో మూడు వేల ఎకరాలు సాగుచేసినట్లు తెలుస్తోంది. ఐదు మండలాల్లో కలిపి దాదాపు మూడు వేల ఎకరాల్లో పంటకు బూడిద, వేరుకుళ్ల తెగులు సోకినట్లు తెలుస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినప్పటికి తెగుళ్ల అదుపులోకి రావడం లేదని పంటకు తీవ్రనష్టం వాటిల్లుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి మిరపను సాగు చేస్తే పంట ఎండిపోయి నష్టం మిగులుతుందని రైతులు వాపోతున్నారు.


బూడిద తెగులు సోకిన మిరప పంట

**పంట ఎండిపోతోంది**

ఎంతో ఆశతో ఈ ఏడాది మిరప పంటను సాగు చేశాను. అయితే అగ్గి (బూడిద)తెగులు సోకడంతో ఊహించని రీతిలో పంట ఎండిపోతోంది. పిచికారి చేసిని తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. రోజురోజుకు తెగులు ఎక్కువ అవుతుంది.

- బడేసా నాయుడు, రైతు గోనెగండ్ల



**మొక్కలను గమనిస్తుండాలి**

విత్తనాలు వేసినప్పటి నుంచి మొక్కలను గమనిస్తుండాలి. మొక్కపూత, కాయ పిందె కాచేసమయంలో ఈ తెగుళ్ల సోకుతాయి. తెగుళ్ల సోకిన మొక్కను వెంటనే తొలగించాలి. పొలంలో నీరు అధికంగా ఉంచరాదు. పంట మార్పిడి, విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించొచ్చు. చీడపీడలను అరికట్టడానికి లింగాకర్షకబుట్టను ఏర్పాటు చేసుకోవాలి.

- ఉద్యానవనశాఖ అధికారులు

# వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

**గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈశ్వర దేవాలయంలో గణేశ్, సుబ్రహ్మణేశ్వర, శివ లింగం, పార్వతిదేవి, బసవేశ్వర, గోపుర కలశం, ధ్వజస్తంభ, నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. విగ్రహాలప్రతిష్ఠ కార్యక్రమాన్ని కల్లుహళ్లి సంస్థాన మఠం పీఠాధిపతి చన్న వీరశివాచార్య మహాస్వాములు, కోటేకళ్లు పరమేశ్వస్వామి నిర్వహించారు. గంగామాత వశనం, గోపురం కలశం గ్రామ వీధుల్లో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్, నవగ్రహ కలశపూజ, అష్టదిక్కుల కలశపూజ, శిలా విగ్రహాల జలాధివాసం, ధాన్యదివాసం, హోమం నక్షత్ర కలశ పూజ నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్నూలు, ఆదోని, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భరతనాట్యం, క్లాసికల్ డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు ప్రజలను ఆకట్టుకున్నాయి.


ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

## బెల్టు నిర్వాకుడిపై కేసు నమోదు

**నందవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కనక వీడు గ్రామం లో డబ్బా ఈరన్న అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహిస్తూ పట్టుబడ్డారు. బుధవారం ఎస్‌ఐ శ్రీనివాసులు ఆయనపై కేసు నమోదు చేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో బెల్టు వ్యాపారుల దందా.. చోద్యం చూస్తున్న అధికారులు... అన్న కథనం ప్రచురితమైంది. దీంతో ఎస్‌ఐ పలు షాపుల్లో సోదాలు నిర్వహించారు. ఈరన్న వద్ద మద్యం దొరకడంతో ఆయనపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు నడిపితే ఉపేక్షించమన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

**పెద్దకడబూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి):** కర్ణాటక మద్యం స్వాధీనం ఒకరిని అరెస్ట్ చేసినట్లు బుధవారం ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మహేష్ అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. అతని వద్ద 96 టేట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ కార్తీక్ సాగర్, ఎమ్మిగనూరు సీఐ మొయినుద్దీన్ బాషా, కోసిగి హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయించాలి

**టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి**

**మంత్రాలయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి కోరారు. బుధవారం మంగళగిరిలోని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రాఘవేంద్రరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బందిని పెంచి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయన వెంట టీడీపీ యువజన నాయకులు రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.


వైద్యఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాఘవేంద్రరెడ్డి

## 'నీటి సమస్య పరిష్కరించాలి'

**ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** పట్టణ శివారు కాలనీల్లో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఏఈ శరత్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు మాట్లాడుతూ పట్టణ శివారు కాలనీలు సంజీవయ్య నగర్, రాఘవేంద్ర నగర్‌లో తాగునీటి సమస్య ఉందన్నారు. పలుమార్లు కమిషనర్, డీఈ, ఏఈ దృష్టికి తీసుకెళ్లిన నేటికి సమస్య పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరారు.

## రాఘవేంద్రుని సన్నిధిలో కన్నడ సినీ నటుడు

**మంత్రాలయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్రస్వామిని ప్రముఖ కన్నడ సినీ నటుడు వినయ్ రాజ్‌కుమార్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు మఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు వినయ రాజ్‌కుమార్‌కు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతాచార్, వ్యాసరాజాచార్, జయతీర్థాచార్‌లు పాల్గొన్నారు.


మంత్రాలయంలో కన్నడ సినీ నటుడు వినయ్ రాజ్‌కుమార్

## స్వర్ణ పంచాయతీలో ఆన్‌లైన్ చేసుకోవాలి


ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

**గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్న గృహాల వారు తప్పని సరిగా స్వర్ణపంచాయతీ కార్యక్రమంలో తమ గృహాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని ఈవోఆర్‌డీ అనంతశైయనా, గోనెగండ్ల పంచాయతీ ఈవో సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని 28 గ్రామాలలో ఉన్న గృహాలవారు 2024-25 సంవత్సరానికి ఇంటి పన్నులు చెల్లించి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన స్వర్ణపంచాయతీలో ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌కు ఎటువంటి ఫీజులు లేవన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 24న కురువల వనభోజనం

**గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో కురువల వనభోజన కార్యక్రమాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కురువ సంఘం నాయకుడు పిల్లిగుండు కృష్ణ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కనకదాసు 537వ జయంతి సందర్భంగా కార్తీక వన భోజనలు ఎమ్మిగనూరు లోని గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని కరువ, కురుబ, మాదాసి కరువ సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## తపాలా శాఖ సేవలపై అవగాహన

**ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని ఎర్రకోట గ్రామ సమీపంలో ఉన్న సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాల, ఎన్ఎస్ఎస్, తపాలా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులకు తపాలా శాఖ సేవలపై ఎమ్మిగనూరు పోస్టల్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీపీబీ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా బ్యాంకింగ్ సర్వీసెస్ అందిస్తుందన్నారు. పోస్ట్ ఆఫీస్ సేవింగ్ స్కీమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సుకన్య సమృద్ధి యోజన, మనీ ట్రాన్స్‌ఫర్ వంటి సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సెయింట్ జాన్స్ ఫార్మసీ కళశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ నాగేష్, ఎన్ఎస్ఎస్ అధికారులు వెంకటేష్, రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని గ్రంథాలయంలో ఇన్‌చార్జి అధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి పాల్గొన్నారు. లైబ్రరీ ప్రాముఖ్యత వివరించారు. వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నందవరం:** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం నందవరం గ్రంథాలయంలో గ్రంథాయల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని లైబ్రేరియన్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


మంత్రాలయంలో..

**కోసిగి:** ఈ నెల 14 నుంచి 20వరకు గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం చివరి రోజైన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధికారి దూలయ్య బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక, కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కోసిగి బాలికల ఉన్నత పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్‌లలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

**మంత్రాలయం:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంపయ్య, ఉపాధ్యాయులు రామన్న, నాగరాజు నాయక్, గోపాల్, ప్రసన్న కుమారి, ఫిజికల్ డైరెక్టర్లు నరసింహరాజు, బసవరాజు, ఈరన్న, సుభాషిని, ఉమ, కవిత పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో విద్యార్థికి సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయురాలు


నందవరంలో..

## నవరత్నాల రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు

**మంత్రాలయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రహ్లాదరాయలకు పాదపూజ, పుష్పాభిషేకం నిర్వహించి పల్లకిలో ఊరేగించారు. అనంతరం నవరత్నాల రథంపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయల స్వామివారిని ఉంచి ఊరేగించారు. భక్తులను ఈ దృశ్యం ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ఊంజల సేవ చేసి భక్తులను ఆశీర్వదించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసిపోయింది.


నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**'ఆంధ్రజ్యోతి' కథనంతో బస్టాండులో పోలీసుల నిఘా**

**కోసిగి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):** అసాంఘిక కార్యక్రలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోసిగి సీఐ మంజునాథ్ హెచ్చరించారు. బుధవారం కోసిగి బస్టాండు పరిసరాలను ఎస్‌ఐ చంద్రమోహన్‌తో కలిసి సీఐ పరిశీలించారు. వారం రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ఆర్టీసీ బస్టాండులో మట్కా జోరు అన్న కథనంతో పోలీసులు మట్కా రాయుళ్లపై దాడులు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అందులో భాగంగా బస్టాండులో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే.. కఠిన చర్యలు తప్పవన్నారు. అనవసరంగా కూర్చుని ధూమపానం, మద్యం, మట్కా వంటివి చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే బస్టాండు పరిసర ప్రాంతాల్లో మట్కా రాస్తున్నట్లు ఎవరైనా సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వీరి వెంట పోలీసు సిబ్బంది సలాం వలి, లక్ష్మినారాయణ ఉన్నారు.


బస్టాండులో కూర్చున్న వారిని విచారిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

## లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

**సీఐ రామాంజులు**


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామాంజులు

**మంత్రాలయం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం పుణ్యక్షేత్రంలో నిబంధనలు అతిక్రమించి పేకాట, మద్యం, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని సీఐ రామాంజులు హెచ్చరించారు. బుధవారం రాత్రి లాడ్జి యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పుణ్యక్షేత్రం పవి త్రతను కాపాడాలన్నారు. భక్తులకు అధిక రేట్లకు అద్దెలు ఇచ్చినా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రతి లాడ్జి యజమాని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ పరమేశ్‌నాయక్, లాడ్జిల యజమానులు రమేష్ రెడ్డి, కృష్ణమూర్తి, వీరారెడ్డి, విజయరామిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

# అంధకారంలో ఐరన్‌బండ


ఇళ్ల ముందు కింద పడిన విద్యుత్ తీగలు

**గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. ఇటీవల ఆర్‌డీఎస్ సంస్థ కింద పాత విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను కూడా లాగుతున్నారు. అయితే గ్రామంలోని ఇవే పాత స్తంభాల నుంచి పంట పొలాలకు కూడా త్రీఫేస్‌తో కూడి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. రాత్రి పూట విద్యుత్ సమస్య వచ్చినప్పుడు మరమ్మతు చేసుకునేందుకు కొంత ఇబ్బందిగా ఉండేది. దీంతో గ్రామస్థులు పంట పొలాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి గ్రామంలోని ఇళ్లకు మాత్రం సింగిల్ ఫేస్ కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. విద్యుత్ అధికారులు మాత్రం పాత పద్ధతిలోనే త్రీఫేస్ కనెక్షన్ ఇస్తామంటున్నారు. ఇందుకు గ్రామస్థులు ఒప్పకోక పోవడంతో అధికారులు పనుల నిలిపివేశారు. దీంతో గ్రామంలోని రెండు కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. అధికారులు గ్రామ పెద్దలతో మాట్లాడి చర్యలు తీసుకొని విద్యుత్ కనెక్షన్‌ను ఏర్పాటు చేయాలని కాలనీ వారు కోరుతున్నారు.


స్తంభానికి వైర్లు లాగి వదిలివేసిన దృశ్యం



# ఆయు...ష్

• ఆయుర్వేద వైద్యశాలలో వైద్యుల కొరత
• ఉన్న ఒక్కరు డిప్యుటేషన్‌పై కర్నూలుకు..
• వైద్యం అందక ఇబ్బందుల్లో రోగులు

**ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యులు కరువయ్యారు. దీంతో వైద్యశాలకు వచ్చే జనం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు అనుసంధానంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక వైద్యాధికారి, ఫార్మాసిస్టు, ఎంఎన్‌వో, ఆఫీస్ సబార్డినేటర్‌ను, పార్ట్ టైమ్ స్వీపర్‌లను నియమించారు. అయితే కొంతకాలంగా కేవలం వైద్యాధికారి, ఫార్మాసిస్టు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు అరకొర వైద్యం, మందులు అందేవి. అయితే స్థానికంగా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు నెల క్రితం డిప్యుటేషన్‌పై కర్నూలుకు వెళ్లారు. కేవలం ఫార్మాసిస్టు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వైద్య సేవల కోసం వచ్చే వారిని పరీక్షించే వారు లేకపోవడంతో రోగులు వెను తిరిగి వెళ్లిపోతున్నారు. నెల రోజులుగా ఆయుర్వేద వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యురాలి స్థానంలో మరొకరిని నియమించాలని వైద్యం కోసం వచ్చే ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యశాలలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**యూనాని వైద్యశాలలో మందులు కరువు**

ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో ఉన్న యూనాని వైద్యశాలలో మందులు కరువయ్యాయి. ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ఉన్నా మందులు లేకపోవడంతో పరీక్షలు చేయించుకున్న రోగులకు ఆదోని, కర్నూలు ప్రాంతంలో ఉన్న యూనాని వైద్యశాలలో తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ప్రజలు అంతదూరం వెళ్లలేక ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. రోజూ యూనాని వైద్యశాలకు పదుల సంఖ్యలో వైద్యం కోసం వస్తున్న వారికి సరిపడా మందులు కూడా లేకపోవడంతో రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రికి అవసరమైన మందులు సరఫరా చేయాలని రోగులు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల